శనివారం
08-06-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 347
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

దక్షిణాఫ్రికాకు మద్దతుపై ఐరాస కోర్టుకు స్పెయిన్ వినతి

మాడ్రిడ్: గాజాలో మారణహోమానికి సంబంధించి ఇజ్రాయిల్‌పై కేసులో దక్షిణాఫ్రికాకు మద్దతు తెలిపేందుకు అనుమతించాలని ఐరాస కోర్టును స్పెయిన్ కోరింది. ఈ మేరకు స్పెయిన్ విదేశాంగ మంత్రి జోస్ మాన్యుయెల్ అల్బరేస్ ఓ ప్రకటన విడుదల చేశారు. గాజాపై ఇజ్రాయిల్ సైనిక దాడులను కొనసాగిస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పశ్చిమాసియా, గాజాలో శాంతి స్థాపన కోసం అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే)కి అన్ని దేశాలు మద్దతు తెలపాలన్నారు. దక్షిణాఫ్రికాకు మద్దతు ప్రకటించిన మొదటి యూరోపియన్ దేశంగా స్పెయిన్ నిలిచింది.

స్టాక్ స్కామ్‌పై సెబీ దర్యాప్తు

- సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం డిమాండ్
- 'ఇండియా'తో కలిసి ముందుకెళతామని స్పష్టీకరణ

న్యూదిల్లీ: ఎగ్జిట్ పోల్స్ ఏకపక్షంగా వెలువడటంపైనా... స్టాక్‌మార్కెట్ ఒక్కసారిగా పెరగడంపైనా సెబీ దర్యాప్తు చేసి పార్లమెంటుకు నివేదిక సమర్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శివర్గం డిమాండ్ చేసింది. ఎన్నికల సంస్కరణలు అవసరమని స్పష్టం చేసింది. ఏడు దశల్లో ఎన్నికల నిర్వహణ కోసం రెండు నెలల సమయం ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, భవిష్యత్‌లో దీనిని నివారించాలని సూచించింది. సీపీఐ సహా వామపక్షాలు సాధించిన ఫలితాలపై ఆత్మవిమర్శ అవసరమని, పూర్తిస్థాయిలో నివేదికలు వచ్చిన తర్వాత ఎన్నికల ఫలితాలను నిశితంగా సమీక్షిస్తామని తెలిపింది. సీట్ల సర్దుబాటు మరింత మెరుగ్గా జరిగి... ఐక్యంగా ప్రచారం నిర్వహించివుంటే బీజేపీని మరింత కట్టడి చేయడం సాధ్యమయ్యేదన్న అభిప్రాయాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం వ్యక్తం చేసింది. పార్టీ కార్యదర్శి అజీజ్ పాషా అధ్యక్షతన గురు, శుక్రవారాల్లో జరిగిన సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఎన్నికల ఫలితాలపై ప్రధాన కార్యదర్శి డి.రాజా సమీక్ష నిర్వహించి చర్చ ప్రారంభించారు. సమావేశం అనంతరం సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం ప్రకటన విడుదల చేసింది. రాజ్యాంగానికి, లౌకిక ప్రజాస్వామ్యానికి అనుకూలంగా ప్రజల తీర్పు వెలువడటంపై సీపీఐ హర్షం వ్యక్తం చేసింది. నిరుద్యోగం, సమాఖ్యవాదంపై, మైనారిటీలపై, ప్రజాస్వామ్యంపై, మానవహక్కులపై దాడులను తిప్పికొడుతూ విద్వేషాన్ని, వివక్షను తిరస్కరించిన దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపింది. మంచి ఫలితాలు రాబట్టగలిగినందుకు ఇండియా ఐక్య సంఘటనలోని పార్టీలను అభినందించింది. ఎన్నికల ప్రచారంలో

- మిగతా 2 లో

ఏకాభిప్రాయంతో ముందుకు...

- ఆదుకున్న దక్షిణాది
- సుపాలన, అభివృద్ధిపై దృష్టి పెడతాం
- ఎన్డీఏ ఎంపీల సమావేశంలో మోదీ
- లోక్‌సభా పక్ష నేతగా ఎన్నిక
- రేపు ప్రధానిగా ప్రమాణస్వీకారం

న్యూదిల్లీ: ఎన్డీఏ 3.0 ప్రభుత్వంలో తీసుకునే అన్ని నిర్ణయాల్లో ఏకాభిప్రాయం ఉండేలా కృషి చేస్తానని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. రాబోయే పదేళ్ల ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో సుపరిపాలన, అభివృద్ధి, నాణ్యమైన జీవితం అనే అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తామని చెప్పారు. పౌరుల జీవితాల్లో జోక్యాన్ని తక్కువ చేస్తామన్నారు. దేశ చరిత్రలో ఎన్డీఏనే అత్యంత విజయవంతమైన కూటమి అని మోదీ చెప్పుకున్నారు. ఎన్డీఏ విజయవంతంగా మూడు పర్యాయాలు పూర్తి చేసుకుని నాలుగో పర్యాయంలోకి అడుగుపెడుతుందని తెలిపారు. ఎన్డీఏ ... నేషన్ ఫస్ట్ అనే సిద్ధాంతానికి కట్టుబడి ఉందని అన్నారు. దిల్లీలోని పాత పార్లమెంటు భవనంలోని సెంట్రల్ - మిగతా 2 లో

ప్రభుత్వ ఏర్పాటుకు రాష్ట్రపతి ఆహ్వానం

2లో

మోదీ రేయింబవళ్లు కష్టపడ్డారు: చంద్రబాబు

ఎన్డీఏను అధికారంలోకి తీసుకురావడానికి మోదీ రేయింబవళ్లు కష్టపడ్డారని చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఆరంభం నుంచి చివరి వరకు మోదీ కష్టపడ్డారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మూడు బహిరంగ సభల్లో పాల్గొన్నారని - మిగతా 2 లో

మేమంతా మీ వెంటే ఉన్నాం: పవన్‌కల్యాణ్

పవన్ కల్యాణ్ మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వానికి జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మోదీ స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. మోదీ ప్రధానిగా ఉన్నంతవరకు ఏ దేశానికి భారత్ తలొగ్గదన్నారు. మోదీ నేతృత్వంలో పనిచేయడాన్ని గర్వంగా భావిస్తున్నామని తెలిపారు.

పరువునష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

బెంగళూరు: పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. కర్నాటక రాజధాని బెంగళూరులోని ప్రత్యేక న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. వార్తా పత్రికల్లో కాంగ్రెస్ పరువునష్టం కలిగించే ప్రకటనలు జారీ చేసిందని ఆరోపిస్తూ బీజేపీ కర్నాటక శాఖ దావా వేసింది. విచారణలో భాగంగా శుక్రవారం రాహుల్ కోర్టుకు హాజరయ్యారు.

గత బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో 40 శాతం కమీషన్ వసూలు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఆరోపించిందని, '40 శాతం కమీషన్ ప్రభుత్వం'గా అభివర్ణిస్తూ పత్రికల్లో పెద్దఎత్తున ప్రకటనలు గుప్పించిందని పేర్కొంటూ బీజేపీ నేత కేశవ్ ప్రసాద్ ఆ పార్టీ తరఫున గతంలో పరువు నష్టం దావా వేశారు. వివిధ రకాల ఉద్యోగాలకు బీజేపీ 'రేటు కార్డులు' పెట్టిందంటూ కాంగ్రెస్ పార్టీ పోస్టర్లు అతికించిందని, తద్వారా తమ పార్టీ పరువుకు భంగం కలిగిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశంపై ఇదివరకు విచారణ జరిపిన బెంగళూరులోని ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య , ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు బెయిల్ మంజూరు చేసింది.

నామినేటెడ్ పదవులన్నీ హుష్!

రాజీనామాలు తెప్పించాలని సీఎస్ ఆదేశాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ హయాంలో నామినేటెడ్ పదవుల్లో నియామకాలు పొందిన వారి పదవులు ఊడిపోనున్నాయి. వారిని వెంటనే సాగనంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆయా శాఖల కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. సకల శాఖల మంత్రిగా పేరు తెచ్చుకున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు దాదాపు 40 మంది ప్రభుత్వ సలహాదారులు ఇప్పటికే రాజీనామాలు సమర్పించిన విషయం తెలిసిందే. నామినేటెడ్ పోస్టుల్లో కొనసాగుతున్న వారిని తక్షణమే తప్పించాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు,

- మిగతా 2 లో

నూతన సీఎస్‌గా నీరబ్ కుమార్ ప్రసాద్

బాధ్యతల స్వీకరణ తర్వాత గవర్నర్‌తో భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఎస్‌గా ఉన్న జవహర్ రెడ్డి సెలవుపై వెళ్లగా, నీరబ్ కుమార్ ప్రసాద్‌ను సీఎస్‌గా నియమిస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయన వెలగపూడి రాష్ట్ర సచివాలయంలోని సీఎస్ చాంబరులో టీటీడీ వేద పండితులు, విజయవాడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానాల వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ తనకు సీఎస్‌గా పనిచేసే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేయనున్న చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సహచర కార్యదర్శులు, శాఖాధిపతులు, ఇతర అధికారులు, సిబ్బంది సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా పనిచేసి వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో మరింత సమర్ధవంతంగా అమలు చేయడం ద్వారా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జీఏడీ కార్యదర్శి సురేశ్ కుమార్, స్పెషల్ సీఎస్‌లు గోపాల కృష్ణ ద్వివేది, రజత్ భార్గవ, కె.విజయానంద్, వై.మధుసూదన్ రెడ్డి, ముఖ్య కార్యదర్శులు కె.సునీత, ప్రవీణ్ ప్రకాశ్, ప్రద్యుమ్న, ఐటీ కార్యదర్శి

- మిగతా 2 లో

సీఎంవో అధికారులపై బదిలీ వేటు

- వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన పూనం, రేవు, గుప్తా
- పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశం
- ఇదే బాటలో మరికొందరు ఐఏఎస్, ఐపీఎస్‌లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి నాలుగోసారి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు సిద్ధమవుతున్నందున అధికార యంత్రాంగంలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఉన్నతాధికారులపై చర్యలు ప్రారంభమయ్యాయి. తొలుత సీఎంవో నుంచే ప్రక్షాళన ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇప్పటికే సీఎస్ జవహర్ రెడ్డిని తప్పుకోవాలని సంకేతాలు ఇచ్చిన చంద్రబాబు, తదుపరి ఆదేశాలు ఇచ్చేలోపే ఆయనే సెలవుపై వెళ్లిపోయారు. అనంతరం ఆయన స్థానంలో మరో సీనియర్ ఐఏఎస్ అధికారి నీరబ్ కుమార్ ప్రసాద్ బాధ్యతలు చేపట్టగా, ఇది జరిగిన కొద్దిగంటల్లోనే సీఎంఓలో మిగిలిన ముగ్గురు కీలక ఐఏఎస్ అధికారులపై బదిలీ వేటు వేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ముగ్గురికీ ఎక్కడా పోస్టింగ్ కూడా ఇవ్వలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎంవోలో కీలకంగా వ్యవహరించిన పూనం మాలకొండయ్య, రేవు ముత్యాలరాజు, నారాయణ భరత్ గుప్తాను బదిలీ చేస్తూ జీఏడీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాటు వారికి ఎక్కడా పోస్టింగ్ కూడా ఇవ్వకుండా జీఏడీకి రిపోర్ట్ చేయాలని మాత్రమే ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో జగన్ ప్రభుత్వంలో వైసీపీ విధేయులుగా ముద్రపడిన అధికారులపై బదిలీ వేటు పడుతున్నట్లు అర్థమవుతోంది. ఇప్పటికే సీఎంవోలో కీలకంగా వ్యవహరించిన ధనుంజయ్ రెడ్డి మే 31వ తేదీ పదవీ విరమణ చేసి వెళ్లిపోగా, తాజాగా ముగ్గురు బదిలీ అయ్యారు. అలాగే ఐపీఎస్‌ల్లో వైసీపీ ప్రభుత్వ విధేయులుగా ముద్రపడిన అధికారులపై చర్యలకు కూడా జాబితా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. కాబోయే సీఎం చంద్రబాబుని కలవడానికి ప్రయత్నించిన సీఐడీ మాజీ చీఫ్ సంజయ్, ఇంటిలిజెన్స్ చీఫ్ సీతారామాంజనేయులు, సిట్ అధిపతి కొల్లి రఘురామిరెడ్డికి అనుమతి నిరాకరించిన

- మిగతా 2 లో

హెరిటేజ్‌కు భారీ లాభాలు

- రూ.579 కోట్లకు పెరిగిన భువనేశ్వరి ఆస్తి
- లోకేశ్ ఆస్తి రూ.237 కోట్లకు పెంపు

న్యూదిల్లీ: టీడీపీ విజయంతో హెరిటేజ్ కంపెనీ ఆస్తుల విలువ భారీగా పెరిగింది. కేవలం ఐదు రోజుల్లోనే హెరిటేజ్ ఫుడ్స్ ఆస్తుల విలువ ఆశ్చర్యకరంగా పెరిగాయి. దీంతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు భార్య నారా భువనేశ్వరి ఆస్తి రూ.579 కోట్లకు చేరుకుంది. చంద్రబాబు కుమారుడు, టీడీపీ యువనేత నారా లోకేశ్ ఆస్తిలోనూ రూ.237 కోట్ల పెంపుదల నమోదైంది. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయంతో చంద్రబాబు స్థాపించిన హెరిటేజ్ కంపెనీ షేర్లు భారీగా లాభపడ్డాయి. హెరిటేజ్ ఫుడ్స్ షేర్ల విలువ 55 శాతం పెరిగింది. దీంతో కంపెనీ ప్రమోటర్ భువనేశ్వరి ఆస్తి రూ.579 కోట్లకు పెరిగింది. ఎన్నికల ఫలితాల ముందురోజు స్టాక్ ట్రేడింగ్ రూ.424 వద్ద జరిగింది. ప్రస్తుతానికి హెరిటేజ్ ఫుడ్స్ షేర్ విలువ రూ.661.25గా ఉంది. కంపెనీలో అత్యధిక షేర్లు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

బూతులు మాట్లాడని మంత్రులనే నియమించాలని డిమాండట!

కేంద్ర కేబినెట్‌పై ఆశలు

- టీడీపీకి రెండు పదవులు దక్కే అవకాశం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికీ ఛాన్స్
- జనసేన ప్రభుత్వంలో చేరికపై సందిగ్ధత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కేంద్ర కేబినెట్ కూర్పుపై దిల్లీలో కసరత్తు జరుగుతుండగా... ఏపీలో ఎవరెవరికి అవకాశాలు దక్కుతాయనే అంశంపై కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. టీడీపీ అధినేత చంద్రబాబు కేంద్రమంత్రివర్గంలో చేరడానికి ఇప్పటికే తన అంగీకారం తెలియజేశారు. అలాగే మంత్రి పదవుల కేటాయింపు అంశాన్ని ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నరేంద్ర మోదీ ఇష్టానికే వదిలేశారు. ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పాటులో టీడీపీ కీలకం కావడంతో కేంద్ర మంత్రివర్గంలో కచ్చితంగా 2 నుంచి 4 వరకు మంత్రి పదవులు దక్కే అవకాశం ఉందని పార్టీ నేతలు అంచనా

- మిగతా 2 లో

రష్యాలో నలుగురు భారతీయ వైద్య విద్యార్థుల మృతి

మాస్కో: రష్యా సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నలుగురు భారతీయ వైద్య విద్యార్థులు మృతి చెందారు. ఈ మేరకు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని భారతీయ రాయబార కార్యాలయం శుక్రవారం వెల్లడించింది. మృతి చెందిన విద్యార్థుల వయస్సు 18-20 ఏళ్ల మధ్య ఉంటుందని

- మిగతా 2 లో

ప్రజాస్వామ్యానికి ముప్పు: బైడెన్

పారిస్: ప్రపంచ దేశాల్లో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఇలాంటి ప్రమాదక పరిస్థితి నెలకొందని, ఇటువంటి కాలంలో మనం జీవిస్తున్నామని ఆయనన్నారు. 80ఏళ్ల కిందటగానీ ప్రస్తుతంగానీ ఏదేని దేశాన్ని ఒంటరి చేయడం ద్వారా ఏ సమస్యకు పరిష్కారం లభించదని చెప్పారు. తమ మిత్రపక్షాల పక్షాన్ని ఎప్పటికీ వదలమన్నారు. కూటములతోనే మనకు బలమన్నారు. దీనిని అమెరికన్లు ఎప్పటికీ మరువరాదని సూచించారు. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తామని, అలాగే అంతర్జాతీయ మిత్రపక్షాలకు తోడునీడగా ఉంటామని, ఎవరినీ ఒంటరిగా వదిలేయమని బైడెన్ సంకల్పించారు. నాటో వంటి సంస్థల ప్రాధాన్యతను ప్రశ్నిస్తూ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల క్రమంలో బైడెన్ మాటలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఉక్రెయిన్ చుట్టుపక్కల దేశాలు... మొత్తం యూరప్ బెదిరింపులు తప్పవని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వైఖరిని ఉద్దేశించి బైడెన్ అన్నారు. నియంతలకు తలవంచే ఆలోచన కూడా రాకూడదని నొక్కిచెప్పారు. ఫ్రాన్స్‌లోని ఓంహా బీచ్‌లో నిర్వహించిన డీ-డే 80వ వార్షికోత్సవంలో

బైడెన్ మాట్లాడారు.

జెలెన్‌స్కీతో బైడెన్ ద్వైపాక్షిక భేటీ

ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో జో బైడెన్ ద్వైపాక్షిక సమావేశాన్ని నిర్వహించినట్లు శ్వేతసౌధం వెల్లడించింది. ఇంటర్ కాంటినెంటెల్ పారిస్ లే గ్రాండ్ హోటల్‌లో ఇద్దరు అధినేతలు భేటీ అయినట్లు తెలిపింది. ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న బైడెన్ పారిస్‌లో జెలెన్‌స్కీని కలిశారని... నార్మండీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు రెండు దేశాల అధినేతలు ఫ్రాన్స్ వెళ్లారు. కీవ్ కోసం 225 బిలియన్ డాలర్ల ప్యాకేజిని బైడెన్ ప్రకటించే అవకాశమున్నట్లు శ్వేతసౌధం వర్గాలు తెలిపాయి.

ఉక్రెయిన్‌కు మిరేజ్ యుద్ధవిమానాలు: మాక్రాన్

ఉక్రెయిన్‌కు మిరేజ్ యుద్ధవిమానాలు సరఫరా చేస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తెలిపారు. ఉక్రెయిన్ సైనికులకు శిక్షణ ఇస్తామని చెప్పారు. మిరేజ్ 2000-5ఎస్ యుద్ధ విమానాలను పంపుతామని, 4,500 మందితో కూడిన ఉక్రెయిన్ బెటాలియన్‌కు యుద్ధ తంత్రం నేర్పుతామన్నారు. తాము పంపే ఆయుధాలను పౌరులపై బాంబు దాడులు చేసేందుకు వినియోగించరన్న హామీనిచ్చారు. ఉక్రెయిన్‌కు సైనిక శిక్షకులను పంపుతామని కూడా చెప్పారు.

మా దళాలు పంపే యోచన లేదు: నాటో చీఫ్

హెల్సింకి: ఉక్రెయిన్‌కు తమ దళాలను పంపే ఆలోచన లేదని నాటో ప్రధాన కార్యదర్శి జెన్స్ స్టోలెన్‌బర్గ్ స్పష్టంచేశారు. ఉక్రెయిన్‌కు మద్దతివ్వడం కోసం పటిష్ఠ కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. రష్యా నుంచి నాటో మిత్రదేశానికి ముప్పు లేదని, యుద్ధం ముగిసిన తర్వాత కూడా ఎలాంటి ముప్పు ఉండబోదన్నారు. మరో యుద్ధానికి కౌంట్‌డౌన్ మొదలవుతుందన్నది తప్పుడు అంచనాగా తెలిపారు.

ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరా వద్దు

ఎర్దోగన్ పిలుపు

అంకారా: ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరాను నిలిపివేయాలని, మారణహోమంలో భాగస్వామ్యం కావద్దని సంబంధిత దేశాలకు టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్దోగన్ పిలుపునిచ్చారు. మానవతా సాయాన్ని అందించేందుకు చేయగలిగినదంతా చేస్తున్నట్లు తెలిపారు. న్యాయపరంగానూ సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఉజ్బెక్ అధ్యక్షుడు షౌకత్ మిర్జియోయేవ్‌తో అంకారలో భేటీ అయి ద్వైపాక్షిక అంశాలపై ఎర్దోగన్ చర్చించారు. అనంతరం సంయుక్త విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గాజాలో మారణహోమంలో భాగస్వామ్యం కావద్దని, ఇజ్రాయిల్‌కు ఆయుధాలు సరఫరా చేయడాన్ని ఆపాలని ఆ దేశానికి సహకరిస్తున్న దేశాలకు ఎర్దోగన్ పిలుపునిచ్చారు.

11దేశాల నేపాల్ రాయబారుల రీకాల్

ఖాట్మండు: భారత్, అమెరికా, బ్రిటన్‌తో సహా 11 దేశాలలోని తమ రాయబారులను నేపాల్ రీకాల్ చేసింది. నేపాల్ కాంగ్రెస్ కోటా కింద నియమితులైన వారిని రీకాల్ చేసినట్లు ఖాట్మండు పోస్ట్ పేర్కొంది. ఉప ప్రధాని, విదేశీ వ్యవహారాల మంత్రి నారాయణ్ కాజి శ్రేష్ఠ తీవ్రంగా అభ్యంతరం తెలిపినప్పటికీ దౌత్యాధికారులను నేపాల్ ప్రభుత్వం వెనక్కి పిలిచిందని నివేదించింది. ప్రధాని ప్రచండ ఆదివారం భారత ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారానికి రానున్న క్రమంలో ఈ పరిణామం చర్చకు దారితీసింది. దౌత్య క్రమశిక్షణకు భంగం కలిగిస్తుందని కొందరు మంత్రులు అభిప్రాయపడ్డారు. రీకాల్ చేసిన రాయబారుల్లో శర్మ (భారత్), శ్రీధర్ ఖాత్రి (అమెరికా), జ్ఞాన్ చంద్ర ఆచార్య (బ్రిటన్), జ్యోతి ప్యాకురెల్ భండారి (దక్షిణ కొరియా), నరేశ్ విక్రమ్ ధాకల్ (ఖతార్), నవరాజ్ సుబేది (సౌదీ అరేబియా), షర్మిలా పరాజులీ ధాకల్ (స్పెయిన్), రామ్ స్వార్థ రాయ్ యాదవ్ (డెన్మార్క్), కాంతా రిజల్ (ఇజ్రాయిల్), దిల్లిరాజ్ పౌండెల్ (మలేసియా), సలీన్ నేపాల్ (పోర్చుగల్) ఉన్నారు. దేశానికి తిరిగి వచ్చేందుకు రాయబారులకు మూడు నుంచి నాలుగు వారాల గడువు ఇచ్చినట్లు మంత్రులు వెల్లడించారు.

కెనడా ప్రజాస్వామ్యానికి భారత్‌తో ముప్పు

ఆ దేశ పార్లమెంటరీ కమిటీ నివేదిక

ఒట్టావా: కెనడా ప్రజాస్వామ్యానికి భారత్‌తో ముప్పు పొంచివున్నట్లు ఆ దేశ పార్లమెంటరీ కమిటీ నివేదించింది. 'రెండవ అతిపెద్ద విదేశీ ముప్పు'గా భారత్‌ను పేర్కొంది. ఈ జాబితాలో చైనాది మొదటి స్థానం కాగా మూడవ స్థానంలో రష్యా ఉన్నట్లు వెల్లడించింది. కెనడా ప్రజాస్వామిక వ్యవస్థలు, విధానాలలో భారత్ జోక్యం క్రమంగా పెరిగినట్లు జాతీయ భద్రతా, పార్లమెంటు సభ్యుల ఇంటెలిజెన్స్ కమిటీ (ఎన్ఎస్ఐసీఓపీ) వెల్లడించింది. కెనడా నాయకులు, మీడియా, ఇండో- కెనడియన్ ఎథో కల్చరల్ కమ్యూనిటీలకు ముప్పు ఉన్నట్లు తెలిపింది. ఖాలిస్థానీ హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య నేపథ్య పరిణామాలతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తత పెరిగిన నేపథ్యంలో ఈ నివేదిక వెలువడింది. కెనడా పార్లమెంటు సభ్యులను విదేశీ శక్తులు ప్రభావితం చేసినట్లు నివేదిక పేర్కొంది. కొందరు ఎంపీలకు విదేశాల నుంచి ముడుపులు అంది ఉండవచ్చని తెలిపింది.

తాజా పరిణామంపై కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడ్యూ స్పందిస్తూ విదేశీ జోక్యం పెరగడం ఆందోళనకరమన్నారు. కెనడా ప్రజాస్వామ్యానికి తమ దేశం నుంచి ముప్పు ఆరోపణలను నిరాధారమైనవిగా భారత్ తోసిపుచ్చింది.

ఏకాభిప్రాయంతో ముందుకు...

(మొదటిపేజీ తరువాయి)

హాల్‌లో శుక్రవారం జరిగిన ఎన్డీఏ పక్షాల పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రసంగిస్తూ మోదీ ఈ వ్యాఖ్యానించారు. తొలుత లోక్‌సభా పక్ష నేతగా మోదీని ఎన్డీయే నేతలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మోదీ పేరును రాజ్‌నాథ్‌సింగ్ ప్రతిపాదించగా చంద్రబాబు, నితీశ్‌కుమార్, అమిత్‌షా, పవన్ కల్యాణ్ తదితరులు బలపరిచారు. అనంతరం మోదీ మాట్లాడుతూ మిత్రపక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ ప్రదర్శనపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్డీఏ అంటే అంటే 'న్యూ ఇండియా, డెవలప్‌డ్ ఇండియా, ఆస్పిరేషనల్ ఇండియా' అని కొత్త అర్థం చెప్పారు. ఇక దక్షిణాది రాష్ట్రాలు ఎన్డీఏను ఆదరించాయని మోదీ చెప్పారు. 'దక్షిణాది ప్రజలు ఎన్డీయేను ఆదరించారు. కర్నాటక, తెలంగాణలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అతి తక్కువ కాలంలోనే అక్కడి ప్రభుత్వాలు ప్రజల విశ్వాసం కోల్పోయాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఆ రాష్ట్రాల్లోని ప్రజలు బీజేపీకి అండగా నిలిచారు. తమిళనాడులో సీట్లు గెలవలేకపోయినా ఓట్లు పెరిగాయి. కేరళలోనూ మా కార్యకర్తలు ఎన్నో బలిదానాలు చేశారు. తొలిసారి అక్కడి నుంచి మా ప్రతినిధి సభలో అడుగుపెడుతున్నారు. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్, సిక్కింలో క్లీన్‌స్వీప్ చేశాం. ఏపీ ప్రజలు కూటమికి పెద్ద ఎత్తున మద్దతిచ్చారు. చంద్రబాబుతో కలిసి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నాం. ఏపీలో ఇంత భారీ విజయం ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టింది' అని మోదీ పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ప్రశంసిస్తూ... పవన్ అంటే పవనం కాదు... తుపాను అన్నారు. 2024 ఎన్నికల్లో ఎన్డీఏ ఘన విజయం సాధించినప్పటికీ విపక్షాలు మన విజయాన్ని తిరస్కరించేందుకు ప్రయత్నించాయన్నారు. ఎన్నికల ముందు ఈవీఎంలను కొందరు సందేహించారని, ఫలితాల తర్వాత అవన్నీ పటాపంచలైనట్లు చెప్పారు. ఇకనైనా విపక్షాలు పార్లమెంట్‌కు వచ్చి చర్చల్లో పాల్గొంటాయని భావిస్తున్నానన్నారు.

మరో పదేళ్లయినా కాంగ్రెస్ 100 దాటదు

కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పిస్తూ... కాంగ్రెస్ చాలా వేగంగా పతనమవుతోందని, మరో పదేళ్ల తర్వాత కూడా ఆ పార్టీ గుణపాఠాలు నేర్చుకోలేదన్నారు. ఇప్పటికీ తన శక్తి సామర్థ్యాలు తెలుసుకునే ప్రయత్నం చేయట్లేదు. కాంగ్రెస్ హయాంలో వారి సొంత ప్రధానినే అవమానించారు. ఆయన నిర్ణయాలను లెక్క చేయలేదు. గత మూడు ఎన్నికల్లో వారికొచ్చిన స్థానాలు... ఈ ఒక్క ఎన్నికల్లో మేం సాధించిన సీట్ల కంటే తక్కువే. మరో పదేళ్లయినా ఆ పార్టీ 100 స్థానాల మార్క్ దాటలేదని మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు.

రేపు ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం

భారత ప్రధానిగా వరుసగా మూడోసారి జూన్ 9వ తేదీ సాయంత్రం నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో బీజేపీ సీనియర్ నేత ప్రహ్లాద్ జోషి ఈ విషయాన్ని తెలిపారు. సమావేశానికి ఎన్డీఏ భాగస్వామ్య పక్ష నాయకులైన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, బీహార్ సీఎం నితీశ్ కుమార్, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఎల్జేపీ నాయకుడు చిరాగ్ పాస్వాన్, హిందూస్థానీ అవామీ మోర్చా అధ్యక్షుడు జితన్ రామ్ మాంఝీ, అనుప్రియ పటేల్‌తోపాటు ఎన్డీయే పక్షాల ఎంపీలు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు. ప్రధాని మోదీని ఎన్డీఏ లోక్‌సభా పక్షనేతగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను బీజేపీ నేతలు అమిత్ షా, నితిన్ గడ్కరీ, జేడీఎస్ అగ్రనేత కుమారస్వామి తదితరులు బలపరిచారు. మోదీ నాయకత్వాన్ని సమర్థిస్తూ ఏకగ్రీవ తీర్మానాన్ని రాజ్‌నాథ్ సింగ్ ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని ఎన్డీఏ కూటమిలోని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. మోదీ నాయకత్వానికి లాంఛనంగా ఆమోదముద్ర వేశాయి. మోదీ నాయకత్వాన్ని, ఎన్డీఏ గత పదేళ్ల పాలనను కీర్తిస్తూ ఎన్డీఏ పక్షాల నేతలు ప్రసంగాలు చేశారు. నూతన ప్రధానిగా మోదీకి సంపూర్ణ మద్దతునిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ 1962 తర్వాత వరుసగా మూడోసారి ఎవరూ దేశానికి ప్రధాని కాలేదన్నారు. మోదీ దూరదృష్టిని దేశ ప్రజలు ప్రత్యక్షంగా చూశారని పేర్కొన్నారు. పదేళ్లపాటు ఎన్డీఏ ప్రభుత్వం దేశానికి సేవలందించిందని వెల్లడించారు. ప్రపంచ దేశాల నేతలు మోదీని ప్రశంసిస్తున్నారని, దేశానికి దశ దిశ నిర్దేశించడంలో మోదీ సఫలమయ్యారని తెలిపారు.

ఇటీవల విడుదలైన లోక్‌సభ ఎన్నికల్లో ఫలితాల్లో ఎన్డీఏ 293 సీట్లు సాధించింది. మెజారిటీ మార్కు 272 కంటే ఎక్కువ సీట్లు రావడం వల్ల కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ వరుసగా మూడోసారి అధికారం చేపట్టనుంది. అయితే ఈ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మెజార్టీ మార్కు దాటలేకపోయింది. దీంతో మిత్రపక్షాలపై ఆధారపడాల్సి వచ్చింది. ఈ క్రమంలో చకచకా పావులు కదిపి ఎన్డీఏ పక్షాలతో కలిసి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది.

మోదీ రేయింబవళ్లు కష్టపడ్డారు

(మొదటిపేజీ తరువాయి)

గుర్తు చేశారు. 'విజనరీ లీడర్ మోదీ నేతృత్వంలో భారత్ అభివృద్ధిలో ముందుంది. దూరదృష్టి కలిగిన మోదీ ఆర్థిక వ్యవస్థను పరుగులు తీయించారు. ఆయన నేతృత్వంలో 2047 నాటికి భారత్ నంబర్ 1గా నిలుస్తుంది. సరైన సమయంలో సరైన నాయకత్వం భారత్‌కు అందివచ్చింది. మోదీ నాయకత్వంలో భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. మోదీ నేతృత్వంలో భారత్ పేదరిక రహితంగా మారుతుంది' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ ఏర్పాటుకు రాష్ట్రపతి ఆహ్వానం

న్యూఢిల్లీ: కేంద్రంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు తమను రాష్ట్రపతి ఆహ్వానించినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. శుక్రవారం ఎన్డీఏ పక్ష నేతగా ఎన్నికైన అనంతరం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మోదీ కలిశారు. ఈ సందర్భంగా తనకు ఆహ్వాన లేఖను రాష్ట్రపతి అందజేసినట్లు మోదీ తెలిపారు. సమావేశం అనంతరం రాష్ట్రపతి భవన్ బయట మోదీ మీడియాతో మాట్లాడారు. "ఆజాదీ కా అమృత్ ఉత్సవాల తర్వాత జరిగిన మొదటి ఎన్నికలు ఇవి. దేశానికి మరింత సేవ చేయాలని ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారు. దేశ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తాం. ప్రజల ఆకాంక్షల మేరకు మరింత ఉత్సాహంగా పని చేస్తాం. ఈరోజు ఉదయమే ఎన్డీఏ నేతలంతా కలిసి చర్చించాం. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాలని రాష్ట్రపతి నన్ను ఆహ్వానించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం గురించి ఆమె ఆరా తీశారు. జూన్ 9 సాయంత్రం ప్రమాణం చేస్తానని తెలిపాను. దీనికి సంబంధించిన ప్రక్రియ కోసం రాష్ట్రపతి భవన్ ఏర్పాట్లు చేసుకుంటుంది. మంత్రివర్గ సభ్యుల పేర్లను త్వరలోనే రాష్ట్రపతికి పంపిస్తాం. ఆ తర్వాత ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుంది" అని మోదీ తెలిపారు.

భద్రతా వలయంలోకి రాష్ట్రపతి భవన్

ప్రధాని ప్రమాణ స్వీకారం నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు అధికారులు. 5 కంపెనీల పారామిలటరీ బలగాలు, ఎన్ఎస్‌జీ కమాండోలు, డ్రోన్లు, స్నైపర్లతో రాష్ట్రపతి భవన్‌లో మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు దిల్లీ పోలీసులు తెలిపారు. అనేక మంది అతిథులు హాజరు కానున్న నేపథ్యంలో సుమారు 2,500 మందితో భద్రతను ఏర్పాటు చేశామని చెప్పారు.

విదేశీ నేతలతో పాటు ప్రత్యేక అతిథులు!

2014లో మోదీ మొదటిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో సార్క్ దేశాల అధినేతలు హాజరయ్యారు. 2019లో బిమ్స్‌టెక్ దేశాల నాయకులు ప్రమాణస్వీకారానికి వచ్చారు. ఈసారి బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, నేపాల్, మారిషస్ సహా పలు దేశాల అధినేతలు రానున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తమకు ఆహ్వానం అందినట్లు శ్రీలంక అధ్యక్షుడి మీడియా కార్యాలయం తెలిపింది. ఈ కార్యక్రమానికి వీరితో పాటు కూటమి నాయకులు, ప్రతిపక్ష సభ్యులు, సినీ, క్రీడారంగ ప్రముఖులు, అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలతో సహా మరికొంత మందిని ముఖ్య అతిథులుగా ఆహ్వానించనున్నట్లుగా అధికారులు తెలిపారు. ఈ జాబితాలో పలువురు ట్రాన్స్‌జెండర్లు, కొత్త పార్లమెంటు భవన నిర్మాణానికి పని చేసిన శ్రామికులు, పారిశుద్ధ్య కార్మికులు, వందే భారత్ రైళ్ల వంటి కీలక ప్రాజెక్టుల్లో పని చేసిన వారికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. భారత దేశాభివృద్ధికి తోడ్పడుతున్న వీరందరినీ మోదీ తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇప్పటికే వివిధ దేశాధినేతలు తమకు ఆహ్వానాలు అందినట్లుగా ప్రకటించారు.

సీఎంవో అధికారులపై బదిలీ వేటు

(మొదటిపేజీ తరువాయి)

విషయం తెలిసిందే. వీరితో పాటు టీడీపీ శ్రేణులపై అక్రమ కేసుల బనాయింపులో మరికొందరు ఐపీఎస్ అధికారులపై బదిలీ వేటు పడనున్నట్లు, ఐఏఎస్, ఐపీఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వైసీపీకి వీర విధేయులుగా వ్యవహరించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇప్పటికే కొందరు కేంద్ర ప్రభుత్వ సర్వీసులోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ఎవరినీ రిలీవ్ చేయవద్దని చంద్రబాబు నుంచి జీఏడీకి ఆదేశాలు అందాయి. దీంతో ఎప్పుడు, ఎవరిపై చర్యలు ఎలా ఉంటాయోనని ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి.

ఏపీ బేవరేజెస్ ఎండీ నివాసంలో సీఐడీ సోదాలు

మరోపక్క ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి నివాసంలో సీఐడీ సోదాలు నిర్వహించింది. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడకు మూడు కార్లలో వెళ్లిన సీఐడీ పోలీసులు ఉదయం నుంచి ఆయన నివాసంలోని వివిధ పత్రాలను తనిఖీ చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం దోపిడీ పర్వాన్ని వాసుదేవరెడ్డి ముందుండి నడిపించారనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. నూతన మద్యం విధానం పేరుతో ఆ పార్టీకి అనుచిత లబ్ధి చేకూరేలా భారీ ఎత్తున మద్యం సరఫరా చేశారని అప్పట్లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొత్త బ్రాండ్‌లు తీసుకురావడంలో వాసుదేవరెడ్డి కీలక పాత్ర పోషించారు. అలాగే మద్యం షాపులను ప్రభుత్వమే నిర్వహించడం, ఆ దుకాణాల్లో డిజిటల్ నగదు చెల్లింపులకు అవకాశం లేకుండా చేయడంలో ఆయనదే కీలకపాత్రగా టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. వైసీపీ ప్రభుత్వానికి మద్యం విక్రయాలు అతిపెద్ద ఆదాయ వనరుగా మార్చడంలో, ఈ శాఖలో డిజిటల్ ఆర్థిక లావాదేవీలు లేకుండా వైసీపీ నేతలు అక్రమ ఆర్జనకు పాల్పడడంలో వాసుదేవరెడ్డి పాత్ర కీలకంగా టీడీపీ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే సీఐడీ ఆయన నివాసంలో సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది.

ఆశీస్సుల కోసం అద్వాణీ, జోషి ఇంటికి మోదీ

న్యూఢిల్లీ: ఎన్డీయే లోక్‌సభాపక్ష నేతగా ఎన్నికైన నరేంద్ర మోదీ... బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వాణీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం ముగిసిన తర్వాత నేరుగా ఆయన ఇంటికి వెళ్లిన మోదీ... వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోతున్న విషయాన్ని స్వయంగా చెప్పారు. ఇద్దరు నేతలూ వివిధ అంశాలపై కొద్దిసేపు చర్చించుకున్నారు. అక్కడి నుంచి పార్టీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి ఇంటికి వెళ్లి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. తర్వాత ఎన్డీయే కూటమి నేతలతో కలిసి మోదీ రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్నారు. తమ వద్ద ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం ఉందని చెబుతూ... అవకాశం ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజ్ఞప్తి చేశారు.

నూతన సీఎస్‌గా నీరబ్ కుమార్ ప్రసాద్

(మొదటిపేజీ తరువాయి)

కె.శశిధర్, వీసర్వీసెస్ శాఖ కార్యదర్శి పి.భాస్కర్, గనుల శాఖ కార్యదర్శి శ్రీధర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్, హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, స్పెషల్ సెక్రటరి డా.చలపతి రావు తదితరులు పాల్గొని సీఎస్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

నీరబ్ కుమార్ ప్రసాద్ ఉద్యోగ ప్రస్థానం

బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ చేసి 1987 ఐఏఎస్ బ్యాచ్‌కు ఎంపికయిన నీరబ్ కుమార్ ప్రసాద్ తొలుత 1988లో పశ్చిమ గోదావరి జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్ (ట్రయినీగా) ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 1990లో తూర్పు గోదావరి సబ్ కలెక్టర్‌గా, రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా, 1991లో ఏటూరు నాగారం పీవో ఐటీడీఏగా, 1992లో కృష్ణా జిల్లా పీడీ డీఆర్డీఏగాను పని చేశారు. 1993లో కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, 1996లో ఖమ్మం కలెక్టర్‌గా, 1998లో చిత్తూరు కలెక్టర్‌గా పని చేశారు. 1999లో యువజన సంక్షేమ శాఖ డైరెక్టర్ శాప్ ఎండీగా పనిచేసి 2000 ఏడాదిలో కేంద్ర సర్వీసులకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. 2005లో రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ వీసీ అండ్ ఎండీగా, 2007లో పరిశ్రమల శాఖ కమిషనర్‌గా, 2009లో మత్స్యశాఖ కమిషనర్‌గా పని చేశారు. అదే విధంగా 2012లో రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి సంస్థ కమిషనర్‌గా, రాష్ట్ర విభజన అనంతరం 2014లో జీఏడీ ముఖ్య కార్యదర్శిగా, 2015లో వైఏటీసీ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. 2017లో కార్మిక ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా, 2018లో ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, 2019లో రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారు. అనంతరం 2019 నవంబరు నుంచి చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్) గా పని చేసి, 2022 ఫిబ్రవరి 23 నుంచి రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సేవలు అందిస్తూ, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

పదవులన్నీ హుష్!

(మొదటిపేజీ తరువాయి)

వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న వారి నుంచి వెంటనే రాజీనామాలు తెప్పించుకుని ఆమోదించాలని ఉత్తర్వులిచ్చారు. ప్రభుత్వం మారడంతో వివిధ శాఖల కింద పనిచేస్తున్న కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు స్వచ్ఛందంగానే బాధ్యతల నుంచి తప్పుకున్నారు. రాజీనామా చేయని వారి పదవులు సీఎస్ ఆదేశాలతో ఊడనున్నాయి.

భారతీయ వైద్య విద్యార్థుల మృతి

(మొదటిపేజీ తరువాయి)

వివరించింది. వెలికి నొవ్గోరోడ్ నగరంలోని నొవ్గోరోడ్ స్టేట్ యూనివర్సిటీలో వారంతా వైద్య విద్య అభ్యసిస్తున్నారని తెలిపింది. వోలోవ్ నదిలో కొట్టుకుపోతున్న యువతిని రక్షించేందుకు నలుగురు సహచర విద్యార్థులు ప్రయత్నించారు. ఆ క్రమంలో వారు సైతం నీట మునిగారు. స్థానికులు వెంటనే స్పందించి... ఒకరిని రక్షించారు. అయితే విద్యార్థుల మృతదేహాలను సాధ్యమైనంత త్వరలో స్వస్థలాలకు పంపుతామని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని భారతీయ రాయబార కార్యాలయం తెలిపింది. అందుకోసం యూనివర్సిటి అధికారులను సంప్రదిస్తున్నామని పేర్కొంది. మరోవైపు రష్యాలోని నదిలో నీట మునిగి మృతి చెందిన విద్యార్థుల స్వస్థలం మహారాష్ట్ర జలగావ్ జిల్లాలోని అమల్నేర్. ఈ ఘటనపై ఇప్పటికే జలగావ్ జిల్లా కలెక్టర్ ఆయుశ్ ప్రసాద్ స్పందించారు. మృతదేహాలను స్వస్థలం తీసుకు వచ్చేందుకు రష్యాలోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదిస్తున్నట్లు చెప్పారు.

హెరిటేజ్‌కు భారీ లాభాలు

(మొదటిపేజీ తరువాయి)

భువనేశ్వరి వద్ద ఉన్నాయి. 2,26,11,525 స్టాక్‌లు కూడా ఆమె పేరు మీద ఉన్నట్లు బీఎస్‌ఈ డేటా చెబుతోంది. లోకేశ్‌కు హెరిటేజ్ ఫుడ్స్‌లో 1,00,37,453 షేర్లు ఉన్నాయి. స్టాక్స్ పెరగడంతో లోకేశ్ ఆస్తి విలువ రూ.247.8కోట్ల మేర పెరిగింది. 1992లో హెరిటేజ్ ఫుడ్స్‌ను చంద్రబాబు స్థాపించారు. హెరిటేజ్ అత్యంత వేగంగా ఎదిగే పబ్లిక్ లిస్టెడ్ కంపెనీగా అధికారిక వెబ్‌సైట్ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా, ఎన్‌సీఆర్ ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో హెరిటేజ్ పాలు, పాల ఉత్పత్తుల మార్కెట్ విస్తరించి ఉంది.

స్టాక్ స్కామ్‌పై సెబీ దర్యాప్తు

(మొదటిపేజీ తరువాయి)

మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ విద్వేష ప్రసంగాలు చేసిన నరేంద్రమోదీపై చర్యలు తీసుకోవడంలో ఎన్నికల సంఘం విఫలమైందని విమర్శించింది. ఇండియా ఐక్య సంఘటనలో కీలకంగా వ్యవహరిస్తామని తెలిపింది. ఉజ్వల భవిష్యత్ కోసం ప్రాథమిక హక్కుల పరిరక్షణ దిశగా ప్రజలను మరింత చైతన్యపర్చడంలో క్రియాశీల పాత్ర పోషించగలమని సీపీఐ పేర్కొంది.

ఎన్నికల్లో ధనబలం పెరిగిపోయిందని, శక్తిమంతమైన ప్రజాస్వామ్యంలో ఇటువంటివి ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. రాజ్యాంగంలోని 'భారత్ ఆలోచన'ను సమర్థిస్తూ ప్రజా తీర్పు వెలువడటంపై హర్షం వ్యక్తంచేసింది. అహంకార బీజేపీకి దేశ ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పారని తెలిపింది. 18వ లోక్‌సభ ఎన్నికలతో ఏకపార్టీ పాలన, కార్పొరేట్ మద్దతుగల బీజేపీ ఫాసిస్టు పాలన అంతమైందని సీపీఐ వెల్లడించింది.

కేంద్ర కేబినెట్‌పై ఆశలు !

(మొదటిపేజీ తరువాయి)

వేస్తున్నారు. ఒకటి కేబినెట్ ఇచ్చినా, మరో రెండు లేక మూడు సహాయ మంత్రి పదవులు లభిస్తాయని ఆశిస్తున్నారు. వరుసగా శ్రీకాకుళం ఎంపీగా మూడుసార్లు గెలిచిన కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు కేంద్రమంత్రివర్గంలో కీలక పదవి లభిస్తుందని భావిస్తున్నారు. గతంలో రామ్మోహన్ నాయుడు తండ్రి ఎర్రన్నాయుడు కూడా కేంద్ర మంత్రిగా పనిచేశారు. తెలుగుదేశం పార్టీకి తొలి నుంచి ఆ కుటుంబం అండగా ఉంటోంది. చంద్రబాబుకు ఎర్రన్నాయుడు అత్యంత సన్నిహితుడు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్న అచ్చెన్నాయుడు...రామ్మోహన్‌నాయుడు బాబాయే. ఈ నేపథ్యంలో రామ్మోహన్ నాయుడికి కచ్చితంగా మంత్రి పదవి ఖాయమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక ఎస్సీ కోటాలో తొలిసారి లోక్‌సభకు ఎన్నికైన అమలాపురం ఎంపీ గంటి హరీశ్ మాధుర్ లేదా బాపట్ల పార్లమెంటు నియోజకవర్గం నుంచి గెలిచిన విశ్రాంత ఐపీఎస్ అధికారి కృష్ణప్రసాద్‌ల్లో ఒకరికి అవకాశం లభించవచ్చని భావిస్తున్నారు. వీరిలో కూడా గంటి హరీశ్ మాధుర్ సీనియర్ నేత. ఆయన గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి కుమారుడు కావడం ఆయనకు సానుకూల అంశంగా మారనుంది. అయితే కోస్తా ప్రాంతం కోటా కింద రామ్మోహన్‌నాయుడును పరిగణిస్తే...రాయలసీమ తరపున చిత్తూరు నుంచి తొలిసారి ఎంపీగా ఎన్నికైన విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ప్రసాదరావు పేరు ప్రతిపాదనలోకి వచ్చే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. ఇక ఓసీ వర్గాల నుంచి నెల్లూరు, నంద్యాల నుంచి ఎన్నికైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బైరెడ్డి శబరిల్లో ఒకరు, గుంటూరు, నర్సరావుపేట నుంచి ఎన్నికైన పెమ్మసాని చంద్రశేఖర్, లావు కృష్ణదేవరాయలులో ఒకరి పేరు పరిశీలించే అవకాశం ఉందంటున్నారు. జనసేన పార్టీ కూడా కేంద్ర ప్రభుత్వంలో చేరితే మచిలీపట్నం నుంచి ఎన్నికైన సీనియర్ ఎంపీ బాలశౌరికి తప్పనిసరిగా అవకాశం లభించనుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీగా ఎన్నికైన దగ్గుబాటి పురందేశ్వరికి కేంద్ర కేబినెట్‌లో తప్పనిసరిగా చోటు లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే ఏపీకి కేటాయించే శాఖలు కీలకమైనవి ఉంటాయా ? లేక గతంలో వలే ప్రాధాన్యత లేని శాఖలు కేటాయిస్తారా ? ఏఏ శాఖలు కేటాయించే అవకాశం ఉందనే దానిపైనా పార్టీ వర్గాల్లో రకరకాల విశ్లేషణలతో చర్చలు ఆసక్తికరంగా సాగుతున్నాయి.

ఐఎస్ఎస్‌లో సునీత విలియమ్స్ డ్యాన్స్



వాషింగ్టన్: భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్‌తో పాటు మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) చేరుకున్నారు. బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌక విజయవంతంగా ఐఎస్ఎస్‌కు అనుసంధానమైంది. వ్యోమగాములకు ఘన స్వాగతం లభించింది. దీర్ఘకాలంగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం గంటకొట్టి వారిని ఆహ్వానించారు. ఐఎస్ఎస్‌కు చేరుకున్న సునీత డ్యాన్స్ చేసి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న మరో ఏడుగురు వ్యోమగాములను ఆలింగనం చేసుకొని తన సంతోషాన్ని వ్యక్తపర్చారు. దీనికి సంబంధించిన వీడియోను బోయింగ్ స్పేస్ తన ఎక్స్ ఖాతాలో పంచుకోగా ప్రస్తుతం అది వైరలవుతోంది. ఐఎస్ఎస్‌లో సునీత డ్యాన్స్ అందరినీ ఆకట్టుకుంటోంది. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐఎస్ఎస్‌లో ఉన్న వారంతా తన కుటుంబ సభ్యుల్లాంటి వారని, వారందరిని కలిసిన సందర్భంగా ఇలా వేడుక చేసుకున్నానని తెలిపారు. బోయింగ్ సంస్థ రూపొందించిన స్టార్‌లైనర్‌కు ఇది తొలి మానవసహిత యాత్ర. అంతకుముందు హీలియం లీకేజీ కారణంగా వ్యోమనౌకలోని గైడెన్స్-కంట్రోల్ థ్రస్టర్లలో ఇబ్బందులు తలెత్తాయి. ఫలితంగా గంట ఆలస్యమైనప్పటికీ.. ఐఎస్ఎస్‌తో అనుసంధానం కాగలిగింది. ఐఎస్ఎస్‌కు చేరే క్రమంలో వ్యోమనౌకలోని నియంత్రణ వ్యవస్థలను సునీత, విల్‌మోర్‌లు కొద్దిసేపు పరీక్షించారు. మార్గమధ్యంలోనూ ఈ క్యాప్సూల్‌ను హీలియం లీకేజీ సమస్య వేధించింది. దీనివల్ల వ్యోమగాములకు ఇబ్బంది లేదని బోయింగ్ ప్రతినిధి తెలిపారు. వ్యోమనౌకలో పుష్కలంగా హీలియం నిల్వలు ఉన్నాయని చెప్పారు. సునీతా విలియమ్స్‌కు ఇది మూడో రోదసి యాత్ర. ఆమె 2006, 2012లో ఐఎస్ఎస్‌కు వెళ్లారు.

వైసీపీలో అలజడి!

- దాడులతో కార్యకర్తల కలవరం
- ఓటమితో నేతల మనస్తాపం
- బయటకురాని సీనియర్లు
- జగన్ నివాసానికి పార్టీ కేంద్ర కార్యాలయం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం వైసీపీ ఘోర పరాజయం పార్టీ నేతలు, కార్యకర్తలను వెంటాడుతోంది. వైసీపీ అధినేత జగన్ నుంచి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, పార్టీ శ్రేణులు ఈ ఓటమిని జీర్ణించుకోలేక పోతున్నారు. ఒక వైపు దాడులు జరుగుతున్నప్పటికీ వాటిని అరికట్టడంలో నేతలు విఫలమయ్యారని పార్టీశ్రేణులు మండిపడుతున్నారు. ఎన్డీఏ కూటమికి చెందిన వారితో తన్నులుతింటున్న తమకు దిక్కెవరని వాపోతున్నారు. మరోవైపు వైసీపీ ఘోర ఓటమిని జీర్ణించుకోలేక పార్టీని వీడే ఆలోచనలో కొందరు ఉన్నట్లు ప్రచారం. ఈ పరిణామాలతో వైసీపీలో అలజడి మొదలైంది. ఈ ఎన్నికల్లో వైసీపీకి 11 అసెంబ్లీ, 4 ఎంపీ స్థానాలు దక్కాయి. వైసీపీ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసినా, గత రెండు విడతల్లోను ఇంతటి ఘోర పరాజయం దక్కలేదు. ఓటమిలో ప్రధాన కారణాలుగా ఈవీఎంల మేనేజ్‌మెంట్‌తోపాటు కార్యకర్తలకు–పార్టీకి మధ్య గ్యాప్ వచ్చిందన్నట్లుగా నేతలు చెబుతున్నారు. ఒక వైపు ఓటమిని స్వీకరిస్తున్నట్లు చెబుతూనే పార్టీ నిర్వహణ తీరు, ప్రజలిచ్చిన తీర్పుపైన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓటమి అనంతరం పార్టీ ముఖ్యనేతలతో జగన్ భేటీ అయినప్పటికీ, దానికి అందుబాటులో ఉన్న కొద్ది మాత్రమే వచ్చినట్లు తెలిసింది. ఉత్తరాంధ్ర, రాయలసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి పూర్తి స్థాయిలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు హాజరు కాలేదు. వారిలో కొందరు మీడియా ముందుకు వచ్చి తాము జగన్‌తోనే పయనం ఉంటుందని చెబుతున్నారు. వైసీపీ నుంచి గెలిచిన 11 మంది ఎమ్మెల్యేల్లో జగన్ మినహా, మిగిలిన వారిలో ఎంత మంది ఎమ్మెల్యేలు చేజారకుండా ఉంటారనేదీ ప్రశ్నార్థకంగా మారింది. అటు రాజ్యసభలో ఉన్న వైసీపీ ఎంపీలు పార్టీ ఫిరాయిస్తారా... నిలబడతారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తాజాగా గుంటూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు వైసీపీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. జగన్ ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నినాదాన్ని ప్రజలు నమ్మలేదని, అందుకే ఆ పార్టీ ఓటమి పాలైందని పేర్కొన్నారు. ఆయన ఎన్నికల ముందు వైసీపీలో చేరి ఆ తర్వాత మళ్లీ పార్టీని వీడారు. ఆయన బాటలోనే మరికొందరు వైసీపీని వీడతారా అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. వైసీపీలో కీలకంగా ఉండే కొందరు నేతలు సైతం ఓటమితో బయటకు రాలేకపోతున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, ఆయన వర్గీయులు ఓటమిపై అంచనాలు వేయలేకపోతున్నారు. విజయనగరం జిల్లాలో మొత్తం అసెంబ్లీ సీట్లు క్లీన్‌స్వీప్ అవుతాయని భావించినప్పటికీ... అక్కడ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణతోపాటు మిగిలిన వారంతా ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికల్లో విజయనగరం జిల్లాల్లో వైసీపీ మొత్తం క్లీన్‌స్వీప్ చేసింది. నెల్లూరు, కడప, కర్నూలులోనూ క్లీన్ చేసినప్పటికీ... ఈ సారి అక్కడ పూర్తిగా ఫలితాలు భిన్నంగా వచ్చాయి. సీఎం జగన్ సొంతజిల్లా కడపలోనూ భారీగా ఎన్డీఏ కూటమి అభ్యర్థులు గెలుపుతో జగన్ కంచుకోటలు బద్దలైనట్లుగా కూటమి నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో రాయలసీమ నుంచి వైసీపీకి 49 అసెంబ్లీ స్థానాలు రాగా, ఈ ఎన్నికల్లో ఆ ఘోరంగా విజయవకాశాలు లభించాయి. నిత్యం ప్రజల్లో ఉండే ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. తాను ఐదేళ్లపాటు వ్యక్తిగత జీవితాన్ని వదులుకుని ప్రజలకు సేవనందించినప్పటికీ, వ్యతిరేకంగా తీర్పు వచ్చిందని వాపోయారు. ఈ తీర్పులో ఈవీఎంలపై అనుమానాలున్నాయని చెబుతున్నారు. ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డితోపాటు చాలా మంది ఓటమి భారంతో బయటకు రాలేకపోతున్నారు. ప్రకాశంజిల్లాకు చెందిన బాలినేని శ్రీనివాసులురెడ్డి తీవ్ర మనస్తాపంతో ఉన్నారు. ఒక్కసారిగా వైసీపీ పరాజయం చెందడంతో పార్టీ ఆవిర్భావం నుంచి గెలుస్తున్న నేతలు అయోమయంలో పడ్డారు. ప్రధానంగా పార్టీ అధినేతతోను, పార్టీతోను సంబంధాలు దూరమవ్వడంతోనే ఈ పరిస్థితి వచ్చిందన్న విమర్శలున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఓటమి అనంతరం వైసీపీ దిద్దుబాటు చర్యలకు ఉప క్రమించింది. తాడేపల్లిలో ఉన్న వైసీపీ కేంద్ర కార్యాలయాన్ని తన క్యాంపు కార్యాలయం వద్దకు తరలించాలని నిర్ణ యించారు. ఈనెల 10న జగన్ క్యాంపు కార్యాలయంలోకి వైసీపీ కేంద్ర కార్యాలయం వెళ్లనుంది. ఇక అక్కడి నుంచే పార్టీ శ్రేణులతో నేరుగా జగన్ అందుబాటులో ఉంటారని సమాచారం.

అల్లర్లపై చంద్రబాబు ఆరా

శాంతిభద్రతలు అదుపు చేయాలని పోలీసులకు సూచన

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల అనంతరం అక్కడక్కడా టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య చోటు చేసుకుంటున్న కవ్వింపు చర్యలు, దాడులపై ఢిల్లీ పర్యటనలో ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. కృష్ణా జిల్లా గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో, మరికొన్ని చోట్ల వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, ఘర్షణల విషయంపై ఆయన పార్టీ నేతల ద్వారా సమాచారం తెప్పించుకున్నారు. వైసీపీ కవ్వింపు చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలుగు దేశం పార్టీ శ్రేణులకు చంద్రబాబు సూచించారు. పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండి ఎటువంటి దాడులు, ప్రతి దాడులు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఈ విషయంలో పార్టీ శ్రేణులు పూర్తి సంయమనంతో ఉండాలని, వైసీపీ కార్యకర్తలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినా ఉద్రేకాలకు లోనుకావద్దని కోరారు. పోలీసు అధికారుల సైతం శాంతి భద్రతలు అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నూతన సీఎస్‌కు ఏపీజేఏసీ శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నీరబ్ కుమార్ ప్రసాద్‌కు ఏపీ జేఏసీ అమరావతి శుభాకాంక్షలు తెలి పింది. వెలగపూడి సచివాలయంలో సీఎస్‌ను ఏపీజేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు తదితరులు శుక్రవారం కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నేత కె.రమేశ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామిశెట్టి వెంకట రాజేశ్, ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ దొప్పలపూడి, నాలుగో తరగతి ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు, ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం చైర్‌పర్సన్ పారే లక్ష్మీ, వైస్ చైర్‌పర్సన్ డి.రత్నకుమారి, గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్య, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీజీ ప్రసాద్, రెవెన్యూసర్వీసెస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి శ్రీనివాస్, ఆర్టీసీ ఈయూ నాయకులు ఎం.శంకరరావు తదితరులు సీఎస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీకి రావెల కిశోర్ రాజీనామా

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం వైసీపీ ఘోర పరాజయం కావడంతో ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి రావెల కిశోర్ శుక్రవారం రాజీనామా చేశారు. ఎన్నికల ముందు ఆయన వైసీపీలో చేరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం వైసీపీతోనే సాధ్యమని భ్రమించి వైసీపీలో చేరినట్లు రావెల చెప్పారు. తనకు ప్రజా సేవ చేసేందుకుగాను గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు అద్భుతమైన అవకాశం ఇచ్చారని, ఆయన నాయకత్వంలో మంత్రిగా పనిచేశానని గుర్తుచేశారు. కొన్ని కారణాల రీత్యా టీడీపీలో కొనసాగలేకపోయినందుకు ఎప్పుడూ అసంతృప్తికి గురవుతున్నట్లు వివరించారు. అనంతరం చంద్రబాబు నాయకత్వంలో తాను పనిచేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలించలేదన్నారు. వర్గీకరణ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఓ వైపు సమాజసేవ చేస్తూనే మరోవైపు ఎస్సీ వర్గీకరణ కోసం తనవంతు ప్రయత్నాలు చేయాలని వైసీపీకి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. సంక్షేమం, సమగ్ర రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుకే సాధ్యమని నమ్మి ఎన్డీఏ కూటమికి చారిత్రాత్మక విజయం కట్టబెట్టారని చెప్పారు.

చిరస్మరణీయుడు 'బొల్లిముంత'

వర్ధంతి సభలో జంగాల నివాళి

విశాలాంధ్ర–తెనాలి: సమసమాజ స్థాపన కోసం కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి అహర్నిశలు శ్రమించిన అభ్యుదయ సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ చిరస్మరణీయులని సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక గాంధీనగర్ లోని పార్టీ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో బొల్లిముంత 20వ వర్ధంతి సభ జరిగింది. పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన జరిగిన సభలో అజయ్‌కుమార్ మాట్లాడుతూ బొల్లిముంత భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన కీర్తి ప్రతిష్టలు అజరామరం అన్నారు. ఉపాధ్యాయ వృత్తిని వదిలి పూర్తి కాలం కమ్యూనిస్టు కార్యకర్తగా పనిచేయడం అభినందనీయమన్నారు. నిగరి, నిరాడంబర జీవితం గడిపిన ఉదాత్త మానవుడు బొల్లిముంత అన్నారు. నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాంతం పనిచేశారన్నారు. నిబద్ధత కలిగిన మానవతావాది అన్నారు. బొల్లిముంత జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. వ్యవసాయ కూలీలు, నిరుపేదలపై దృష్టి సారించి కమ్యూనిస్టు భావజాలాన్ని ప్రతిబింబిస్తూ అనేక కథలు రాశారన్నారు. చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా సాగిన భూపోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని చెప్పారు. తెలంగాణాలో నిజాం నిరంకుశత్వానికి, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడుతూ ప్రాణాలు అర్పించిన అమరవీరులకు మృత్యుంజయులు నవలలో చిత్రీకరించారని అన్నారు. సింగారావు మాట్లాడుతూ బొల్లిముంత నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు ఉద్యమకారుడు అన్నారు. అభ్యుదయ సినిమాలకు బాక్సాఫీస్ హిట్ సంభాషణలు సమకూర్చారని చెప్పారు. బొల్లిముంత కృష్ణ, పట్టణ కార్యదర్శి కిరణ్ బాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేశ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు గురుబ్రహ్మం పాల్గొన్నారు. తొలుత వివిధ ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు బొల్లిముంత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వండి: జమలయ్య

విశాలాంధ్ర–మచిలీపట్నం టౌన్: కౌలురైతులకు వెంటనే గుర్తింపు కార్డులు (సీసీఆర్సీ) జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంఘం కృష్ణాజిల్లా సమితి ఆధ్వర్యంలో జమలయ్యతో పాటు జిల్లా కార్యదర్శి తమ్మ చిన్న కొండయ్య, జిల్లా అధ్యక్షుడు తలారి రామారావు, జిల్లా నేత యలమంచిలి వెంకటేశ్వరరావు, కోటి లింగం తదితర ప్రతినిధుల బృందం జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్. పద్మావతిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మోదుమూడి శ్రీహరిరావు భవన్‌లో తలారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జమలయ్య మాట్లాడుతూ సాగుభూమిలో 80 శాతం పంటలు పండిస్తున్నది కౌలురైతులేనని అన్నారు. గ్రామ సభలు జరిపి భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలుగుర్తింపు కార్డులు జారీ చేయాలని జాయింట్ డైరెక్టర్‌ను కోరామని చెప్పారు. కౌలుగుర్తింపు కార్డులు లేకపోయినా పట్టాదారు పాస్ పుస్తకం, కౌలురైతుల సెల్ఫ్ డిక్లరేషన్‌ను పరిగణనలోకి తీసుకొని పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు 90 శాతం సబ్సిడీపై అందించాలని కోరారు. దేవాలయ భూములు సాగు చేసే కౌలురైతులకు కూడా గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూసార పరీక్షలు నిర్వహించాలని, జింకు, బోరాన్, జిప్సం వంటి సూక్ష్మ పోషకాలను అందించి భూసారాన్ని పెంచి పంట ఉత్పాదనకు తోడ్పాటు ఇవ్వాలని జమలయ్య కోరారు. 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్' పెంచి పంటరుణాలు ఇవ్వాలని కోరారు. గత రబీలో నష్టపోయిన పంటలకు పెట్టుబడి రాయి తీ, పంటల బీమా పరిహారం విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య మాట్లాడుతూ ఖరీఫ్‌కు సన్నద్ధమవు తున్నా... డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తిచేయక పోవడం దారుణమన్నారు. పంటకాల్వల్లో తూటీకాడ, గుర్రపు డెక్కను తొలగించాలని కోరారు. ఏఐటీయూసీ మచిలీపట్నం గౌరవ అధ్యక్షుడు లింగం ఫిలిప్, నియోజకవర్గ కార్యదర్శి ఒ.ఎల్.రావు పాల్గొన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వానికి సహకరిస్తాం: ఈయూ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పడుతున్న ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తామని ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ స్పష్టంచేసింది. ఈ మేరకు రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రబాబు నాయుడు, కూటమి నేతలు పవన్ కల్యాణ్, పురందేశ్వరికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా రవాణా(ఆర్టీసీ)ని ప్రజలకు మరింత చేరువ చేయాలని, అక్రమ రవాణాను అరికట్టి ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నందున బస్సులను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్కేయూలో వైఎస్సార్ విగ్రహం తొలగింపు

విశాలాంధ్ర–జేఎన్టీయూఏ: అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూని వర్సిటీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని శుక్రవారం తొలగించారు. ముందుగా పాలకమండలి సమావేశంలో తీర్మానం చేసి తొలగింపు ప్రక్రియ చేపట్టారు. టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు గురువారం ఉప కులపతి రిజిస్ట్రార్లను కలిసి యూనివర్సిటీలో రాజకీయాలకు తావు లేదని వెంటనే రాజశేఖర్ రెడ్డి విగ్రహం తొలగిం చాలని వినతిపత్రం అందించారు. వినతిని పరిశీలించి పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకుని విగ్రహాన్ని తొలగించారు. విగ్రహ స్థానంలో త్వరలో అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. గతంలో ఉపకులపతి రామకృష్ణారెడ్డి ఏకపక్షంగా, అప్పటి విద్యార్థి సంఘ నాయకులు అడ్డుకున్నా అందరినీ బెదిరించి, తన స్వార్థం కోసం రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేశారని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి.

జగన్... ఆత్మవిమర్శ చేసుకో

వర్ల రామయ్య

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఓటమిని జీర్ణించుకోలేని వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆత్మవిమర్శ చేసుకోకుండా జనాలపై నిందలు వేస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ బటన్ నొక్కితే ఓటేయాలా అని ప్రశ్నించారు. ఆయన ఇంకా ఊహాలోకంలో విహరిస్తున్నారని విమర్శించారు. జగన్ చేసిన ఘోరాలు–నేరాలు, దళితులపై హింసాకాండ, మాచర్లలో రావణకాష్టను జనం మరువలేదన్నారు. ఇన్ని చేసిన వీరు గవర్నర్ వద్దకు వెళ్లి ఫిర్యాదులు ఎలా చేస్తున్నారని నిలదీశారు. స్థానిక ఎన్నికల్లో ఏ రకంగా వ్యవహరించారో అందరికీ తెలుసన్నారు. ఎస్సీలు వైసీపీకి బానిసలు కాదని, నిరంకుశ, ప్రజా వ్యతిరేక పాలనను తిరస్కరించారని వర్ల రామయ్య అన్నారు. చంద్రబాబు ప్రచార రథంపై ఉన్నప్పుడు 307 సెక్షన్ పెట్టి వేధించారని, టీడీపీ అరాచకం చేయాలనుకుంటే వైసీపీ నేతలు ఎవరూ మిగలబోరని హెచ్చరించారు. డిప్యూటేషన్‌పై వచ్చి అరాచకాలకు సహకరించిన అధికారుల లెక్కలన్నీ తేలాలని, వీరిపై చర్యలు చట్టబద్ధంగానే ఉంటాయని చెప్పారు. జగన్ కోర్టులను తప్పుదారి పట్టించారని, సీబీఐ దాఖలు చేసిన 11 చార్జిషీట్లలో ఏ రోజు కోర్టుకు హాజరు కాలేదన్నారు. చేసిన దానికి జగన్ మూల్యం చెల్లించుకోకతప్పదని వర్ల రామయ్య హెచ్చరించారు.

రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలాయి...

జోక్యం చేసుకోవాలంటూ గవర్నర్‌కు జగన్ వినతి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలిపోయాయని, చంద్రబాబు రాజకీయ కక్షసాధింపులతో ప్రజాస్వామ్యానికే పెనుముప్పు వచ్చిందని వైసీపీ అధినేత జగన్ తెలిపారు. టీడీపీ యథేచ్ఛదాడులతో ఆటవిక పరిస్థితులు తలెత్తాయని, యంత్రాంగం మొత్తం నిర్వీర్యం అయిపోయిందని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం జగన్ ట్వీట్ చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలపైనా ఉన్మాదంతో దాడులు చేస్తున్నారని, పార్టీనుంచి పోటీచేసిన అభ్యర్థులకు రక్షణే లేకుండా పోయిందన్నారు. ఉన్నత చదవులకు కేంద్రాలైన యూనివర్సిటీల్లో ఆచార్యులపై దౌర్జన్యాలకు దిగి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. గడచిన ఐదేళ్లలో పాలనా సంస్కరణలు, పేదలను ఆదుకునే కార్యక్రమాలతో దేశంలో రాష్ట్రానికి వచ్చిన పేరు ప్రఖ్యాతులన్నింటినీ దెబ్బతీసి కేవలం మూడురోజుల్లోనే హింసాయుత రాష్ట్రంగా మార్చారన్నారు. ప్రజాస్వామ్యానికి, పౌరస్వేచ్ఛకు తీవ్ర భంగం వాటిల్లుతోందని, తక్షణమే గవర్నర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

హింసాయుత ఘటనల్లో బాధితులైన పార్టీ కార్యకర్తలకు, నా అన్నదమ్ములకు, నా అక్కచెల్లెమ్మలకు వైసీపీ తోడుగా నిలుస్తుందని జగన్ భరోసా ఇచ్చారు.

జగన్‌ను కలిసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి అనంతరం పార్టీ అధినేత జగన్‌ను కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఓటమి పాలైన అభ్యర్థులు కలిశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వివిధ జిల్లాలకు చెందిన పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆయనను కలిశారు. గెలిచిన అభ్యర్థులు జగన్‌తో కలసి ఫోటోలు దిగారు. ఎమ్మెల్యే దాసరి సుధ, తానేటి వనతి, అంబటి రాంబాబు, టీజేఆర్ సుధాకర్‌బాబు ఉన్నారు.

కొడాలి నాని ఇంటిపై కోడిగుడ్లతో దాడి

గుడివాడలో ఉద్రిక్తత – బెజవాడలో వంశీ ఇంటిపై దాడికి యత్నం

టీడీపీ కార్యకర్తలను చెదరగొట్టిన పోలీసులు

విశాలాంధ్ర–విజయవాడ (వన్‌టౌన్): ఏపీలో టీడీపీ శ్రేణుల విజయోత్సవాలు శ్రుతి మించుతున్నాయి. కొన్నిచోట్ల కార్యకర్తలు కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. తాజాగా గుడివాడలో మాజీ మంత్రి కొడాలి నాని ఇంటిపై కొంతమంది టీడీపీ కార్యకర్తలు కోడిగుడ్లు విసిరారు. ఆయన నివాసం ముందు మైక్ పట్టుకుని నినాదాలు చేశారు. ఇంటి పై దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా... పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ పోలీసులకు, టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం నెలకొంది. ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానని కొడాలి నాని గతంలో సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో కొడాలి నాని తన సవాల్‌ను నిలబెట్టుకోవాలంటూ తెలుగు యువత అధ్వర్యంలో కార్యకర్తలు ఆయన ఇంటి ముట్టడికి ప్రయత్నించాయి. ఈ క్రమంలోనే గుడివాడ వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు అధ్వర్యంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదంటూ వారించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారు వినిపించుకోకపోవటంతో పోలీసులు, టీడీపీ వర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది.పోలీసులు వారికి సర్దిచెప్పి అక్కడ్నుంచి పంపేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఇక విజయవాడ మైనేని రోడ్డులో తాజా మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఇంటి వద్ద నాలుగు కార్లలో వచ్చిన టీడీపీ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. దమ్ముంటే బయటకు రావాలని సవాల్ విసిరారు. ఇంటి ముందున్న గేట్లను ధ్వంసం చేసేందుకు ప్రయత్నం చేశారు. ఆ సమయంలో వంశీ ఇంట్లోనే ఉన్నారు. సమాచారం అందుకున్న మాచవరం పోలీసులు అక్కడి చేరుకుని కార్యకర్తలను అక్కడి నుంచి తరిమేశారు. కాగా భవానీపురం శివాలయం సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం తొలగించాలని టీడీపీ కార్యకర్తలు గొడవకు దిగారు. రోడ్డు మధ్య నిర్మాణం చేసిన విగ్రహాన్ని వెంటనే తొలగించాలని పట్టుబట్టారు. లేదంటే తామే తొలగిస్తామని హల్‌చల్ చేశారు. దీంతో బెజవాడ పోలీసులు అప్రమత్తమై దేవినేని అవినాష్ ఇంటి ముందు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయకుల ఇళ్ల వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

వంశీ అనచరులే రెచ్చగొట్టారు: యార్లగడ్డ: వంశీ అనుచరులు మా కుర్రాళ్లను బూతులు తిట్టడం వల్లే ఘర్షణ ప్రారంభమైందని గన్నవరం ఎమ్మెల్యేగా ఎన్నికైన యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ఇరు వర్గాలను పంపించాల్సిన పోలీసులు మా వాళ్లను కొట్టారని ఆరోపించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలతో లాఠీఛార్జ్ చేయించారని... ఎనిమిది మందికి గాయాలయినా కూడా వారిని ఆస్పత్రికి తరలించకుండా స్టేషన్‌లో ఉంచారని చెప్పారు.

'నీట్' పేపర్ లీకేజీపై విచారణ జరపాలి

ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒకే సెంటర్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం అనేక అనుమానాలు కలిగిస్తున్నదని, తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని, దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెబుతున్నా కేంద్రం నిర్లక్ష్యం కారణంగా వేలాదిమంది ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం ఎన్‌టీఏ విడుదల చేసిన పరీక్షా ఫలితాలపైన, పేపర్ లీకేజీపైన సిట్టింగ్ జడ్జితో విచారించాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

కొయ్యకాళ్ల ప్రభుత్వం

ఎన్నికల ఫలితాలు వెలువడ్డ తరవాత బిజేపీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ. బలం కేవలం 262. బీజేపీకి కేవలం 240 సీట్లు మాత్రమే దక్కాయి. అంటే ఎన్.డి.ఎ. భాగస్వామ్య పక్షాలన్నింటినీ కలిపినా 262 సీట్లు మాత్రమే ఉన్న మోదీకి మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవకాశంలేదు. చంద్రబాబు నాయకత్వంలోని టీ.డి.పి. కి దక్కిన 16 స్థానాలను, పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జన సేన సాధించిన రెండు స్థానాలను, జె.డి.(యు) కు వచ్చిన 12 సీట్లు కలిపితే కానీ మోదీకి ప్రభుత్వం ఏర్పాటుచేసే అవకాశం రాలేదు.

ఎన్.డి.ఎ.లో పేరుకు 41 పార్టీలున్నప్పటికి అందులో 22 పార్టీలకు లొక్‌సభలో ప్రాతినిధ్యమే లేదు. ఎన్.డి.ఎ. లో చాలా పార్టీల పేర్లు చెప్పడం కూడా సాధ్యం కాదు. తెలుగుదేశం, జనసేన, జె.డి. (యు) ఎన్.డి.ఎ.లో భాగస్వామ్య పక్షాలు కావు. ఇవి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి వెలుపలి నుంచి మాత్రమే మద్దతు ఇస్తున్నాయి. తెలుగు దేశం, జనతా దళ్(యు) ప్రభుత్వం ఏర్పాటులో మోదీకి సహకరించడానికి ఈ రెండు పార్టీలు అంగీకరించినా అవి విధించే షరతులు మోదీకి సంకటంగానే ఉన్నాయి. తెలుగు దేశం, జనతా దళ్(యు) పార్టీలు తమ రాష్ట్రాలకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలని కోరుతున్నాయి. ఈ రెండు పక్షాలు ఈ డిమాండును తాత్కాలికంగానైనా పక్కన పెడితే తప్ప మోదీకి మద్దతుఇచ్చే వీలేలేదు. ఇప్పటికే ఈ రెండు పక్షాలు షరతులు పెట్టడంతో పాటు కీలక మంత్రిపదవులు కోరుతున్నాయి. అధికారంలో భాగస్వామ్యం ఉండాలన్నదే ఈ రెండు పక్షాల ప్రధాన లక్ష్యం కనక ప్రత్యేక ప్రతిపత్తి డిమాండును పక్కనపెట్టి మద్దతు ఇవ్వాలని నిర్ణయించు కున్నట్టున్నాయి. ఇప్పుడు కూడా ప్రత్యేక హోదా డిమాండును మాటవరసకు వల్లించినా పట్టు పట్టకపోవచ్చు. మోదీకి మద్దతు ఇవ్వడం ద్వారా కేంద్ర రాజకీయాల్లో తాము చక్రం తిప్పే స్థితిలో ఉండాలని చంద్రబాబు, నితీశ్ కుమార్ కోరుకుంటున్నారు. చంద్రబాబు, నితీశ్ కుమార్ అనుభవ జ్ఞులైన, రాజకీయ పరిణతి ఉన్న నాయకులు. ఎప్పుడు ముందడుగు వేయాలో, ఎప్పుడు వేచి చూడాలో, ఎప్పుడు వెనక్కు తగ్గాలో వీరికి బాగా తెలుసు. మోదీతో బంధాలు తెంచుకుని ఎప్పుడు వెనక్కు తిరగాలో కూడా వారికి బాగా తెలుసు. అన్నింటికీ మించి సంకీర్ణ ప్రభుత్వాలు నడిపే స్వభావం మోదీకి ఎన్నడూ లేదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆ తరవాత పదేళ్ల ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మోదీ తన మాటే చెల్లించుకునే రీతిలోనే వ్యవహరించారు. ఆయనది ఆధిపత్యం చెలాయించే ధోరణే తప్ప సర్దుబాటు చేసుకోవడం, ఇతరుల మాట వినే తత్వం లేదు. చంద్రబాబు, నితీశ్ కుమార్ గతంలోనూ బీజేపీతో కలిసి ప్రభుత్వంలో ఉన్న వారే. కానీ కిందటి సారి చంద్రబాబు ఎన్.డి.ఎ.తో తెగతెంపులు చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇవ్వకపోవడమే ప్రధాన కారణం. ఈ రెండు పార్టీలకు మతతత్వ ధోరణి కూడా లేదు. అయితే మతతత్వ వాదులతో తమకు అవసరమైనప్పుడు కలిసి నడిచిన సందర్భం ఉంది. అన్నింటికన్నా మించి తెగ తెంపులు చేసుకున్న తరవాత చంద్రబాబు ఎన్నడూ ఇతర పార్టీలతో కలిసి పనిచేయలేదు.

ప్రతిపక్ష ఐక్యత కోసం ప్రయత్నించిన సంఘటనలు నితీశ్ కు ఉన్నాయి. చంద్ర బాబు ప్రతిపక్ష ఐక్యత కోసం ఎప్పుడైనా పని చేసినా అది తనకు మేలు కలిగే దృష్టితో మాత్రమే చేశారు. ఎన్.టి.ఆర్. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్యత కోసం కృషి చేశారు. ఆ దశలోనే నేషనల్ ఫ్రంట్ 1989లో ఏర్పడింది. ఎన్.టి.ఆర్. నేషనల్ ఫ్రంట్ అధ్యక్షుడిగా ఉండే వారు. ఆ దశలో ఎన్.టి.ఆర్. మాటను జవదాటే అవకాశం చంద్రబాబుకు లేదు.

ఎన్నిసార్లు కప్పదాట్లు వేసినా నితీశ్ కుమార్ సైద్ధాంతికంగా సోషలిస్టు భావాల ఇంగువ గడ్డగానే ఉన్నారు. గత జనవరిలో మళ్లీ కప్ప దాటు వేయకముందు నితీశ్ ప్రతిపక్ష ఐక్యత కోసం చేసిన కృషి విస్మరించడానికి వీలు లేనిది. "ఇండియా" ఐక్య సంఘటన ఏర్పాటులో ఆయన కీలకపాత్ర పోషించారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావ్, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, చంద్రబాబు ప్రతిపక్ష ఐక్యత కోసం చేసిన ప్రయత్నాలన్నీ వారి నాయకత్వంలో ప్రతిపక్షాలు ఐక్యం కావడం కోసమే. అందుకే ఆ విన్యాసాలేవీ దరి చేరలేదు. ఇప్పుడు మోదీకి అండగా నిలవాలని నిర్ణయించిన చంద్రబాబుకు, నితీశ్ కుమార్ కు మధ్య భావసారూప్యతా శూన్యమే. మోదీ నడపాలనుకుంటున్న సంకీర్ణ ప్రభుత్వానికి ఉండబోయే రెండు చక్రాలు ఏ రూపంలోను సామ్యం ఉన్నవి కావు. సంకీర్ణ ప్రభుత్వాలు మనకు కొత్త కాదు. పీవీ నరసిం హా రావు అయిదేళ్ల పాటు మైనారిటీ ప్రభుత్వం ఏర్పాటుచేసి విజయవంతంగా నెగ్గుకొచ్చారు. అప్పటి సమీకరణలు భిన్నమైనవి. ప్రభుత్వ సారథికి నెగ్గుకొచ్చే నైపుణ్యంఉండి తీరాల్సిందే. మోదీకి అది లేదు. ఈ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించలేక పోవడానికి మోదీ వ్యవహారశైలే ప్రధాన కారణం. పదేళ్ల అధికారంలోఉన్న తరవాత ఏ ప్రభుత్వం మీదైనా అసంతృప్తి పెరగడం సహజమే. మొట్ట మొదటి సారి ఆయన సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించబోతున్నారు. సం యమంతో వ్యవహరించడం మోదీ తత్వం కాదు కనక అది అంత సులభమైన విషయం కాదు. నియంతకు ఉండవలసిన సంపూర్ణ మెజారిటీ ఇప్పటిదాకా మోదీ బండి నడపడానికి ఉపకరించింది. సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపే సంయమనం, చొరవ, ఓరిమి వాటిని అలవరచుకునే శక్తి కూడా మోదీకి ఉండే అవకాశం లేదు. చంద్రబాబుకు, నితీశ్ కుమార్‌కు ఉప ప్రధాని పదవులు ఇవ్వొచ్చునన్న ఊహాగానాలు సాగుతున్నాయి. తాను కేంద్రానికి వెళ్తే రాష్ట్రంలో తన ఆధిపత్యం ఎక్కడ తగ్గుతుందోనన్న అనుమానం చంద్రబాబును ఎప్పుడూ పీడిస్తూ ఉంటుంది. తన తరవాత ఎక్కువ ప్రజాదరణ ఉన్న నాయకుడు రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ మాత్రమే. కానీ ఆయనకు అసెంబ్లీలో వచ్చిన స్థానాలకన్నా తెలుగు దేశానికి ఉన్న బలం చాలా ఎక్కువ. అందువల్ల పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అయితే తెలుగుదేశంలో చిచ్చు రేగవచ్చు. అధికారం సంపాదించడానికి మాత్రమే చంద్రబాబు పవన్ కళ్యాణ్‌తో సఖ్యంగా ఉన్నారు తప్పితే చూస్తూ చూస్తూ అధికారం అప్పగించేటంతటి ఔదార్యం ఆయనకు లేదు. ఆయన అసలు లక్ష్యం తన కుమారుడికి ఎప్పుడో ఒకప్పుడు తన వారసత్వం అప్పగించాలనే. ఏమైతేనేం మోదీ ప్రభుత్వం హంసపాదుతోనే మొదలు కాక తప్పదు.

మోదీ అహంకారానికి దెబ్బ

సురవరం సుధాకరరెడ్డి
సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి

ఎన్నికల ఫలితాల తర్వాత అనేక విశ్లేషణలు వచ్చాయి. ఇంకా వస్తాయి. కేంద్రంలో బీజేపీ పార్లమెంటు సభ్యుల సంఖ్య తగ్గటం అనేకమందికి ఒక రిలీఫ్. తనకుతాను దైవ దూతగా ప్రకటించుకున్న నరేంద్ర మోదీ అహంకారానికి దెబ్బ తగిలింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రత్యర్థుల మీద అనేక అన్యాయమైన ఆరోపణలు చేశారు. "కాంగ్రెస్ వస్తే అయోధ్య రామాలయాన్ని కూల్చి వేస్తారని", "హిందూ మహిళల పుస్తెలు లాక్కొని ముస్లింల కిస్తారని" ఆయన చేసిన దుష్ప్రచారం పనిచెయ్యలేదు. కాని ప్రధాని స్థాయిని దిగజార్చింది. మోదీ ప్రచారం, అమెరికా వియత్నాంపై దాడిలో "కార్పెట్ బాంబింగ్" చేసిన విషయం గుర్తుకువస్తుంది. కార్పెట్ బాంబింగ్ అంటే గెరిల్లా యోధులను ఏరివేయటానికి వియత్నాంలో ప్రతి అంగుళం భూభాగంపైన బాంబులు వేసింది. నేపాల్మ్ బాంబులు ఉపయోగించింది. విత్తన బంతులులాగ గుండుసూదుల బంతులు తయారుచేసి గ్రామాలమీద వేసింది. విషవాయువును ఉపయోగించింది. అయినా ఓడిపోయింది. అది వేరే కథ.

మోదీ ప్రతిపక్షపార్టీలను చీల్చారు. చిన్న పార్టీలను బలహీనపర్చారు. దగ్గరకు తీసినట్లే తీసుకుని వాటిని నిర్వీర్యం చేశారు. పంజాబ్‌లో అకాలీదళ్‌ని, హర్యానాలో చౌతాలా పార్టీని తీసిపారేశారు. దిల్లీ ముఖ్యమంత్రిని, జార్ఖండ్ ముఖ్యమంత్రిని అరెస్టుచేసి జైల్లో పెట్టించారు. తెలంగాణలో కేసీఆర్ కుమార్తె కవితను అరెస్టుచేసి జైల్లో పెట్టించారు. మధ్యప్రదేశ్‌లో, గుజరాత్‌లో కాంగ్రెస్ నాయకులను తన పార్టీలో తీసుకోవడమేగాక, వారి అభ్యర్థులను కొనుగోలుచేసి పోటీచేయకుండా ఉపసంహరింపచేశారు. మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సీపీలను చీల్చి, వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీశాడు. వారి ప్రభుత్వాన్ని పడగొట్టాడు. కాంగ్రెసు మేనిఫెస్టో ముస్లింలీగ్ మేనిఫెస్టోలాగ ఉందని ప్రచారం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ, ఇన్‌కంటాక్స్ దళాలను అల్సేషన్ కుక్కలలాగ ప్రత్యర్థులమీద ప్రయోగించాడు. నలభైఏళ్లనాటి కచ్చీతీవును, కాంగ్రెస్, డి.ఎం.కె. శ్రీలంకలకు దారాదత్తం చేశాయనీ, మత్స్యకారులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. కేరళ ముఖ్యమంత్రి కుమార్తెపైన ఒక తప్పుడు కేసు రుద్దాడు.ఎన్నికల కమిషన్‌లో సభ్యులను నియమించే చట్టం మార్చి, ఒకసభ్యునితో రాజీనామా చేయించి, తనసుకూలమైన సభ్యులను నియమించుకున్నాడు. సర్వసైన్యాధిపతి రిటైర్ అయితే ఒక నెల పొడిగించడం అనేక అనుమానాలకు దారితీసింది. ప్రశ్నిస్తే సైన్యాన్ని రాజకీయాల్లోకి లాగుతారా అని ఆగ్రహించారు. గోబెల్స్ సిగ్గుపడేవిధంగా అవలీలగా అబద్ధాలు చెప్పాడు.

ఇండియా కూటమి గట్టి పోటీనిచ్చింది. దేశవ్యాపితమైన ప్రచారం దీటుగా సాగించింది. కాని సంపూర్ణ ఐక్యత రాలేదు. ఇండియాకూటమి బలం పెరిగింది. ఇండియాకూటమి బలం పెరిగేందుకు యూపీ, పశ్చిమబెంగాల్, తమిళనాడు, మహారాష్ట్ర తోడ్పడ్డాయి. తెలంగాణలో, రాజస్థాన్‌లో, కర్నాటకలో

కాంగ్రెస్ సీట్లు పెరిగాయి. కాని కాంగ్రెసు పాలిత రాష్ట్రాలలో తగినన్ని సీట్లు రాకపోవడంపై వారు సమీక్షించుకోవాలి. బీజేపీ, బీహార్, గుజరాత్ బాగా సహాయపడ్డాయి. నాగాలాండ్‌లో, పుదుచ్చేరిలో, లక్షద్వీప్‌లో, మణిపూర్‌లో కాంగ్రెసు సీట్లు గెలవడం, గోవాలో బీజేపీ ఒక సీటు గెలవడం, కాంగ్రెస్ పునరుద్ధరణకు దోహదపడుతుంది. అయోధ్యలో ఒక సీటు ఓటమి రామాలయం నాటకం పనిచేయలేదని అర్థమవుతుంది. అధికారానికి 63 మంది సభ్యుల తేడా దూరంలో ఉన్నారు. బీజేపీ 200 సీట్లకు పరిమితమై చంద్రబాబు, నితీశ్‌ల ఊతకర్రల సహాయంమీద ఆధారపడి ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాబోతోంది. చంద్రబాబు రెండు పర్యాయాలు, నితీశ్‌కుమార్ మూడు పర్యాయాలు, ఎన్‌డీఏ లోకి వెళ్లి బైటకు వచ్చినవారే. నమ్మకం లేని సహచరులని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతానికి అలాంటి ప్రమాదంలేదు. అవకాశము లేదు. కానివారు బీజేపీని పూర్తిగా నమ్మరు. బీజేపీ వాళ్లను నమ్మదు.

బీజేపీని బైటనుండి బలపరచిన వైసీపీ, భారతీయ రాష్ట్రసమితి, ఆల్ ఇండియా అన్నాడీఎంకె పార్టీ, ఒడిశాలో నవీన్ పట్నాయక్ పార్టీ బిజూ జనతాదళ్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. వీటిపని అయిపోయిందని భావించడం సరైందికాదు. పుంజుకునే అవకాశాలున్నాయి. ఇప్పుడు చంద్రబాబు, నితీశ్ చక్రం తిప్పుతారని, అనేక మంత్రి పదవులు కోరుతున్నారని స్పీకర్ కూడా బాబు కోరుతున్నారన్న వార్తలు వస్తున్నాయి. బీజేపీ స్పీకరు పదవిని ఇవ్వదు. ఆంధ్రాకు ప్రత్యేక హోదా ఇవ్వదు. టీడీపీ, జేడీయూ లేకపోయినా నిలదొక్కుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని మంత్రి పదవులు ఒక్కొక్క పార్టీకి రెండు, మూడు ఇవ్వవచ్చు. ఏడుగురు స్వతంత్రులున్నారు. ఇద్దరు టెర్రరిస్టు ఆరోపణలతో ఉన్నారు. వారు బలపరిస్తే వారు జైళ్ల నుంచి బైటకు వస్తారు. ఇతరులను కొనవచ్చు. అకాలీదళ్ ఇండియా కూటమిలోకి వెళ్లలేదు గనుక బీజేపీతో ఉండవచ్చు. కేసుల భయంతో జగన్‌కూడా ఎన్‌డీఏకు మద్దతు ఇవ్వవచ్చు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎంపీలు కాంగ్రెస్‌తో సహా ఇండియా కూటమిలో కూడా ఉండవచ్చు.

కొత్త ప్రభుత్వం సంకీర్ణం కనుక దూకుడు తగ్గవచ్చునన్న అభిప్రాయం కొందరిలో ఉంది. ఏడవతేదీన ఎన్‌డీఏ పార్లమెంటు సభ్యులు మిత్రపక్షాల నాయకులతో పాత పార్లమెంటు భవనంలో జరిగిన సమావేశంలో నరేంద్ర మోదీ ఉపన్యాస ధోరణిని బట్టి అలాంటిదేమీ ఉండకపోవచ్చు. వాగాడంబరం ప్రతిపక్షాల మీద దాడి పాతపద్ధతి లోనే కొనసాగింది. ప్రత్యేక హోదా ఇస్తానని మోసం చేసినా, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్ముతానని పట్టుబట్టినా, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీని మూడు సీట్లలో గెలిపించారు. ఆంధ్రలో ఎవరుగెలిచినా బీజేపీకి మద్దతిస్తారని ముందు నుంచి అనుకున్నదే. చంద్రబాబు మీద కేసులు పెట్టి జైలుకు పంపి భయానక వాతావరణం సృష్టించి, చంద్రబాబును, బీజేపీతో ఎన్నికల ఒప్పందానికి జగన్ మోహన్ రెడ్డి నెట్టాడు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెసు, వామపక్షాలు పుంజుకోలేకపోవడం, రాష్ట్ర రాజకీయాలకు నష్టం కలిగిస్తుంది."కాంగ్రెసు రహిత భారతదేశం" అన్న అమిత్ షా నినాదం కార్యాచరణలోకి రాకపోగా, ఆ పార్టీ మరింత బలోపేతమైంది. అసలు యుద్ధం రాబోయే రోజుల్లో ఉంది. వామపక్షాలు చాలా స్వల్పంగా 5 నుంచి 8 స్థానాలకు (ఆర్‌ఎస్‌పి) తో కలుపుకుంటే 9 స్థానాలకు పెరిగింది. ఇది చాలదు. కేరళలో వామపక్షాలకు ఒక్క సీటు మాత్రమే రావడం దిగ్భ్రాంతి కలిగించింది.

కాంగ్రెసు అధికారంలోకి వచ్చినా మౌలిక సమస్యలు పరిష్కారం లేదన్నమాట వాస్తవమే. అయినా గుడ్డికంటే మెల్ల కన్ను మేలన్నట్లుగా పెద్దశత్రువును ఓడించేందుకు, ప్రతిపక్ష బూర్జువా పార్టీలను బలపరచడం వామపక్షాలకు అనివార్యం.

మనదేశంలో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి పరిమితులున్నాయి. సంవత్సరాల తరబడి తప్పుడు కేసుల్లో మేధావులను అరెస్టుచేసి, చార్జిషీటులు లేకుండా, బెయిల్ లేకుండా చేస్తున్న పరిస్థితుల నుంచి బైటపడేందుకు కోర్టులకు ధైర్యం కావాలి. నిజాయితీ అధికారులకు సాహసం పెరగాలి. భావ ప్రకటనాస్వేచ్ఛను, ఊపిరి తీసుకునేందుకు, ప్రజా సమస్యలపై ఆందోళనలు, పోరాటాలు సాగించేందుకు, అబద్ధాల నుంచి, అసత్యాల నుంచి, తప్పుడు దాడుల నుంచి, కుహనా దేశభక్తుల నుంచి ఫాసిస్టు ధోరణలు నుంచి, దేశాన్ని కాపాడేందుకు ప్రత్యామ్నాయ ప్రభుత్వంవస్తే, అవకాశాలు పెరుగుతాయని ప్రజలు విశ్వసించారు. బలమైన ప్రతిపక్షం ప్రజలలో కొంతవరకు విశ్వాసాన్ని నింపుతుంది. వామపక్షాల పోరాటాలు రానున్న కాలంలో ముఖ్యం. అధిక ధరలమీద, నిరుద్యోగం మీద, దళితులు, మైనారిటీలపై దాడులకు వ్యతిరేకంగా, కార్మికుల హక్కుల రక్షణకోసం రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరంతర పోరాటాలు తక్షణావసరం. భిన్న భాషలు, మతాలు, సంస్కృతుల భారతదేశ సమగ్రతను, సమైక్యతను కాపాడుకునేందుకు వామపక్ష, సెక్యులర్ ప్రజాతంత్ర పార్టీల, శక్తుల ఐక్యతతో పోరాటం సాగించాలి.

పరాజితుల లోకం

ఓ ప్రహసనం ముగిసింది. గెలిచింది ఎవరో తేలింది. ఓడిన వారెవ్వరో తెలిసిపోయింది. పరాజితులు మాత్రం మిగిలిపోయారు. అవును, అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో పరాజితులెప్పుడూ ప్రజలే.

ఎన్నికల క్షేత్రంలో ఓడిన వారు ఉండరు. అన్ని రాజకీయ పార్టీలు ఎక్కడో ఒకచోట గెలుస్తానే ఉంటాయి. కొన్ని పార్టీలు ఎక్కువ చోట్ల గెలిచి అధికార పీఠం ఎక్కుతాయి. మరికొన్ని పార్టీలు తక్కువ సీట్లతో ప్రతిపక్షంలో కూర్చుంటాయి. ఒక్కోసారి ఆ గౌరవం కూడా దక్కకపోవచ్చు. అయినా, ఆ పార్టీ నుంచి విజయం సాధించిన ప్రతినిధులు శాసనాలయాలలో కూర్చుంటారు. అలా ఏ అర్హత లేకుండా, కేవలం ఓటు మాత్రమేవేసి ఐదేళ్లవరకూ ఎదురుచూపులు చూసేది పరాజితులైన ప్రజలే. ఎన్నికలైపోయిన తర్వాత దేశం దిగులుగా ఎందుకుంటుందంటే ఎక్కడ చూసినా పరాజిత సమూహమే ఎదురుపడుతుంది.

ఓట్ల పండుగకు ముందు నీ బిడ్డ ముక్కు చీమిడి తీసిన

చక్రవాకం

- ముక్కాము చక్రధర్

చేతులు మళ్లీ ఐదేళ్ల వరకూ నీ కంట పడవు. నీ బిడ్డల అలనా, పాలనా చూసేది మేమే అన్న ప్రచారాలు నీ చెవుల్లో మారుమోగుతాయి తప్ప ఆలా మాట్లాడిన వారెవ్వరూ ఎక్కడా కానరారు. అధికారం చేజిక్కిన తర్వాత వారి ఎజెండాలే అమలవుతాయి తప్ప పరాజితుల బతుకులు సోదిలోకి కూడా రావు. ఒకప్పుడు అలా ఉండేది కాదని, ప్రజల కోసమే బతికిన వారిని మేము చూసామని కొందరు పెద్దలు చెబుతారు.

ఆ ఒకప్పుడు అనే పదం ఇప్పుడు ఏ నిఘంటువులోనూ కనపడదు. పరాజితుల గురించి దేశంలో ఎక్కడా ఏ చర్చా జరగదు. మీడియాలో కాని, పట్టణాల్లోకాని, పల్లెల్లో కానీ పరాజితుల ఊసే ఉండదు. ఎన్నికలు ఏదైనా రణక్షేత్రంలో గాయాలతో మిగిలేది పరాజితులైన ప్రజలే. ఓట్ల కోసం వచ్చిన అభ్యర్థులు ఇడ్లీ బండి దగ్గర దోసెలు వేసిన దృశ్యం మాత్రమే నీకు గుర్తుంటుంది. ప్రజాస్వామ్య దేశంలో అంకెలే ప్రమాణికం కనుక పరాజితుల ప్రాణాలపై కాసింతైనా శ్రద్ధ కనపడదు. ఓటువేసే సమయంలో చూపుడు వేలుకు రాసిన సిరా చుక్క పరాజితుడికి పాములా భ్రాంతి గొలుపుతుంది.

ఆ పాము వొళ్లంతా తిరుగుతూ ఎక్కడ, ఎప్పుడు కాటేస్తుందోననే భయం వెంటాడుతుంది. ఓట్ల పండుగకు నువ్వు తిన్న బిర్యానీ పొట్లం, తాగి పడేసిన సీసా పరాజితుడి వెర్రిబాగులతనానికి ముసి ముసిగా నవ్వుకుంటాయి. నువ్వు ఎన్నుకున్న నాయకుడు నీకు కనిపించినా ఓ అపరిచితుడిలా నిన్ను దాటుకుంటూ వెళ్లిపోవడం బ్యాలెట్ బాక్సంత నిజం. ఎన్నికలైపోయాక బతుకు మీద భయం కలుగుతుంది. ఎన్నికలైపోయాక ప్రతి రోజూ ఆకలేస్తుందని గుర్తొస్తుంది.

ఎన్నికలైపోయాక కలల గూడు మాయమైందని తెలుస్తుంది. ఎన్నికలైపోయాక ఎవరొచ్చినా జీవితాలు మారవని ఎరుక కలుగుతుంది. ప్రతీ ఐదేళ్లకు ఇది ఇలాగే జరుగుతుంది. ఇలాగే జరిగేలా ఏలిక జాగ్రత్తలు తీసుకుంటుంది. మళ్లీ ఐదేళ్లకు మరో ప్రహసనం ప్రారంభమవుతుంది. కాల చక్రం తప్ప బతుకు చక్రం ముందుకు పోదని అర్థం అవుతుంది.

సీనియర్ జర్నలిస్టు,
సెల్: 99120 19929

ఇప్పుడైనా ప్రత్యేక హోదా ఇస్తారా?

టి.వి.ఎస్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయాక మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఓటమి పాలైంది. అనంతరం బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. 2014 లో లోకసభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రధాని పదవి చేపట్టిన నరేంద్రమోదీ తాము గెలిస్తే తప్పకుండా ప్రత్యేక హోదా ఇస్తామని, పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తామని, వెనుకబడిన ఏడు జిల్లాలకు ప్రతి ఏటా జిల్లాకు రూ.500 కోట్లు ఇస్తామని నరేంద్రమోదీ వాగ్దానం చేశారు. వివిధ రాష్ట్రాలకు వందల వాగ్దానాలు చేసి వాటిని అమలు చేయలేదు. వాగ్దానాలు నెరవేర్చక పోవడం మోదీ ప్రత్యేకత. 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రబాబునాయుడు ప్రభుత్వంలోగానీ, అనంతరం వైసీపీ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోగానీ ప్రత్యేక హోదా ఇచ్చేది లేదని, పంచవర్ష ప్రణాళికను రద్దుచేసి, దాని స్థానంలో తెచ్చిన నీతిఆయోగ్ అనుమతించడంలేదని సాకుచెప్పి ఎగవేశారు. పదేళ్లు సాగించిన ప్రజా వ్యతిరేక, విద్వేష పాలన మూలంగా 2024 లోకసభ ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటుకు తగినన్ని సీట్లను బీజేపీ గెలవలేదు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టీడీపీ, జనసేన, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం సహాయం మోదీ ప్రభుత్వం ఏర్పాటుకు తప్పనిసరి అవసరమైంది. అలాగే బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మద్దతు కూడా కచ్చితంగా అవసరం. ఈ నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రిగా త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబునాయుడు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ను సాధించగలిగిన స్థానంలో ఉన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడం, సుదీర్ఘ కాలం పోరాడి సాధించి విశాఖపట్నంలో ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టకుండా నిలవరించడం లాంటి అతి ముఖ్యమైన డిమాండ్లను సాధించవలసిన బాధ్యత చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వంపైన ఉంది. బహుశా ఇప్పటికే చంద్రబాబునాయుడు ఈ డిమాండ్లను మోదీతో మాట్లాడి ఉండవచ్చని ప్రజలు అనుకుంటున్నారు.

రాష్ట్రంలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలు, మూడు లోకసభ సీట్లను బీజేపీ గెలుచుకోవడానికి టీడీపీ, జనసేన అవకాశం కల్పించాయి. అందువల్ల చంద్రబాబునాయుడు రాష్ట్రానికి తప్పనిసరిగా అవసరమైన ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణను సాధించగలరన్న ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే దాదాపు పదేళ్లుగా నిత్యావసరం వస్తువుల ధరలు పెరిగిపోతున్నా కేంద్రంలో మోదీ ప్రభుత్వం పట్టించుకోకుండా నల్ల ధన కుబేరుల సంఖ్యను పెంచడంలో తలమునకలై ఉన్నారు. నిరుద్యోగాన్ని, పేదరికాన్ని పెంచుతూ పరిపాలన చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు, కొనసాగటానికి సహాయపడుతున్న చంద్రబాబునాయుడు ప్రభుత్వం కోరనున్న డిమాండ్లను తప్పనిసరిగా అంగీకరించవలసిన నైతిక బాధ్యత

నరేంద్రమోదీ పైన ఉన్నది. అలాగే ఏపీకి కేంద్ర ప్రభుత్వం మంత్రి వర్గంలో కీలకమైన మంత్రిత్వ శాఖలు ఇవ్వడం ద్వారా రాష్ట్రం ఇప్పటికైనా అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పించాలి. రైతులను, కార్మికులను తీవ్రమైన కష్టాలకు లోనుచేయడం, మత ద్వేషాన్ని వెళ్లగక్కుతూ, మైనారిటీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చడానికి అన్ని ఏర్పాట్లు చేసిన మోదీ ప్రభుత్వం 2024 లోకసభ ఎన్నికల్లో దారుణంగా నైతికంగా ఓటమి పాలైందని చెప్పాలి. ప్రభుత్వం ఏర్పాటు అవకాశం కలిగినప్పటికీ ప్రజలు తమ వ్యతిరేకతను వ్యక్తం చేసిన పరిస్థితి స్పష్టంగా తెలుస్తోంది. 110 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి ప్రజలను అప్పులపాలు చేశారు. ప్రజలకు చేసిన మేళ్లు ఏమీ లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వాలు దేశాన్ని నాశనం చేశాయని, కుంభకోణాల్లో చిక్కుకుపోయామని విమర్శలు చేస్తూ, ఆ పార్టీ నాయకులను, తనను విమర్శించే ముఖ్యమంత్రులను సైతం అరెస్టు చేయించడం మోదీ 'ఘనత' అని చెప్పాలి. ఈసారైనా విద్వేషం విడనాడి రాష్ట్రం విడిపోయాక అంతగా అభివృద్ధికి నోచని ఆంధ్రప్రదేశ్‌కు సమాయపడాలి. గత పదేళ్లలో సాగించిన అరాచకాలను విడనాడి ఆదర్శనీయమైన నాయకుడని మోదీ అనిపించుకుంటారా?

చంద్రబాబునాయుడు, నితీశ్‌కుమార్‌ల మద్దతుతోనే ఎన్‌డిఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతున్నానన్న అంశాన్ని గుర్తించాలి. చంద్రబాబునాయుడు 16 లోకసభ సీట్లను, నితీశ్‌కుమార్ 12 సీట్లను కలిగి ఉన్నారు. వీరి తోడ్పాటుతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మోదీ 2014 లో అమరావతి రాజధానిగా శంకుస్థాపనకు వచ్చారు. ఈసారి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవానికి మోదీ హాజరవుతారని తెలుస్తోంది. ఈ సందర్భంగానైనా ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాను ప్రకటించడమేగాక, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి అవసరమైనన్ని నిధులను ప్రకటించాలి. ఈ వాగ్దానాలను ఈసారైనా నెరవేర్చగలరని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటుపై అనిశ్చితి ఏర్పడిందని భావిస్తున్న తరుణంలో చంద్రబాబు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే ముందుగా ఆంధ్రప్రదేశ్‌కు, బిహార్‌కు ప్రత్యేక హోదాను ప్రకటించి రెండు రాష్ట్రాలకు సహాయం చేయాలి. 2014 లో శంకుస్థాపనకు వచ్చి చెంబెడు నీళ్లు, రాయి తెచ్చి ఇచ్చి అపహాస్యం పాలయ్యారు. రాష్ట్రం విడిపోయినప్పుడు ఎక్కువ ఆదాయం వచ్చే హైదరాబాదు తెలంగాణాకు వెళ్లింది. ఫలితంగా రాష్ట్ర అభివృద్ధి కుంటుపడింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచింది. రెండు రాష్ట్రాల మధ్య పరిష్కారం కావలసిన అనేక అంశాలు అలాగే మూలపడి ఉన్నాయి. ముఖ్యంగా నదీజలాల సమస్య పరిష్కారం కావలసి ఉంది. 2019 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించింది. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మద్దతు పొందిన మోదీ ప్రత్యేక హోదా ఇవ్వలేదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తగిన నిధులనూ మంజూరు చేయలేదు. అమరావతి రాజధానికి అభివృద్ధి చెందడానికి సైతం మోదీ సహకరించాలి. మోదీ మూడవసారి ప్రధానమంత్రి కావడానికి సహకరించిన వారి డిమాండ్లను నెరవేర్చవలసిన కనీస ధర్మం మోదీకి ఉంది. ఈ దిశగా చంద్రబాబు తగిన విధంగా ఒత్తిడి చేయాలి.

‘నీట్’ అక్రమాలపై సుప్రీం పర్యవేక్షణలో విచారణ

కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ : వైద్య విద్య కోర్సుల ప్రవేశ పరీక్ష ‘నీట్’ అక్రమాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి విచారణ జరపాలని కాంగ్రెస్ శుక్రవారం డిమాండ్ చేసింది. బీజేపీ యువతను మోసం చేసి వారి భవిష్యత్తుతో ఆడుకుంటోందని విమర్శించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) సహా అనేక పరీక్షల్లో పేపర్ లీకేజీలు, కాపీయింగ్, అవినీతి అంతర్భాగంగా మారాయని విమర్శించారు. ‘దీనికి మోదీ ప్రభుత్వమే ప్రత్యక్ష బాధ్యత వహించాలి. నియామక పరీక్షలకు హాజరయిన అభ్యర్థులు ఆపై అనేక అవకతవకలను ఎదుర్కోవడం, పేపర్ లీకేజీ చిక్కుల్లో చిక్కుకుంటున్నారు. వారి భవిష్యత్తుతో ఆడుకుంటున్నారు. బీజేపీ దేశంలోని యువతను మోసం చేసింది’ అని ఆయన ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు. ‘నీట్, ఇతర పరీక్షలకు హాజరయిన ప్రతిభావంతులైన విద్యార్థులకు న్యాయం జరిగేలా సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి దర్యాప్తు జరగాలని మేము డిమాండ్ చేస్తున్నాం’ అని పేర్కొన్నారు. అయితే ‘నీట్’ పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తోసిపుచ్చింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ‘ఎక్స్’ వేదికగా స్పందిస్తూ ‘లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యతకు సంబంధించిన నీట్ పరీక్షల్లో జరిగిన కుంభకోణం ఆమోదయోగ్యం కాదు, క్షమించరానిదన్నారు. ‘ఇది దేశంలోని లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రత్యక్ష జూదం. దీనిని తక్షణమే సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నతస్థాయిలో దర్యాప్తు చేయాలి’ అని డిమాండ్ చేశారు. ‘ఈ ఏడాది పేపర్ లీకేజీ వార్తలను అటకెక్కించారు. ఇప్పుడు విద్యార్థులకు మార్కులు పెంచారని అనేక మంది అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఈసారి రికార్డు స్థాయిలో 67 మంది అభ్యర్థులు టాప్ ర్యాంక్ సాధించారని, వీరిలో ఆరుగురు అభ్యర్థులు ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన వారేనని విద్యార్థులు చెబుతున్నారు’ అని పేర్కొన్నారు. ‘విద్యార్థులు ఎలా మోసపోయారు, ఎవరు చేశారు, ఎన్నికల ఫలితాల సందడి మధ్య జూన్ 4న ఉద్దేశపూర్వకంగా ఈ ఫలితాన్ని జూన్ 14న ప్రకటించాల్సి ఉండగా ఎందుకు ప్రకటించారనేదే ప్రశ్న’ అని జైరాం రమేశ్ అన్నారు. 67 మంది టాపర్లు ఏకకాలంలో 720/720 మార్కులు ఎలా పొందారు? ఒకే పరీక్షా కేంద్రం నుంచి ఎనిమిది మంది విద్యార్థులు 720/720 మార్కులు ఎలా పొందారు? ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కుల విలువ ఉంది. అప్పుడు నీట్ ప్రశ్నపత్రం లీక్ అయిన తర్వాత విడుదలైన ఫలితాల్లో 67 మంది విద్యార్థులు 720 మార్కులకు 718-719 సంఖ్యలు ఎలా వచ్చాయి?’ అని ప్రశ్నించారు. నీట్-యూజీ ఫలితాల్లో భారీ అవకతవకలు జరిగే అవకాశం ఉందని, ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాలా గురువారం అన్నారు. ఈ అక్రమాలు దాదాపు 24 లక్షల మంది పిల్లల భవిష్యత్తును దెబ్బతీశాయని ఆరోపించారు. దీనిపై ఫిర్యాదులను పరిష్కరించాలని పార్టీ నేత కన్హయ్య కుమార్ డిమాండ్ చేశారు.

దర్యాప్తు చేయాలి: ప్రియాంక

న్యూఢిల్లీ: నీట్-2024 ఫలితాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆరోపించారు. దీనిపై వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని వెంటనే దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకైందన్న ఆమె... ఇప్పుడు ఫలితాల్లోనూ కుంభకోణం జరిగినట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు తన ‘ఎక్స్’ ఖాతాలో పోస్టు చేశారు. ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు ఆమె చెప్పారు. వీటన్నింటినీ నివృత్తి చేయాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మరోవైపు నీట్ ఫలితాల వెల్లడి తర్వాత కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుండటంపై ప్రియాంక దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. నీట్ పేపర్ లీకేజీ ఆరోపణలపై అధికారులు సరైన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ‘లక్షలాది మంది విద్యార్థుల గోడును ఈ ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తోంది. నీట్ పరీక్ష ఫలితాల్లో అవకతవకలు జరిగాయని పదేపదే మొత్తుకుంటున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు. దర్యాప్తు చేపట్టి వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా’ అని ప్రియాంకగాంధీ ప్రశ్నించారు.

మోదీ ప్రమాణానికి ప్రత్యేక అతిథులు వీరే...

పారిశుద్ధ్య కార్మికులు, కూలీలు, అలింగులకు ఆహ్వానం

న్యూఢిల్లీ : భారత ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇది గతంలో భారతదేశం మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మాత్రమే కలిగి ఉన్న పెద్ద రికార్డు. మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆహ్వానితుల జాబితా భారీ సంఖ్యలో ఉంటుంది. రాజకీయ నాయకులతో పాటు అధికార, ప్రతిపక్షాల నుంచి, సినీ, క్రీడారంగ ప్రముఖులు, అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తల నుంచి ప్రజల వరకు గణనీయమైన సంఖ్యలో హాజరుకానున్నారు. నరేంద్ర మోదీని అందరికంటే భిన్నంగా ఉంచేది ఇక్కడే. తన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే ప్రత్యేక ఆహ్వానితుల జాబితాను మోదీ సిద్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ప్రత్యేక ఆహ్వానం పంపినట్లు ఒక ఆంగ్ల వార్తా సంస్థ తెలిపింది. కొంతమంది అలింగులను కూడా ఆహ్వానించారు. ఇది కాకుండా, కొత్త పార్లమెంటు భవనంతో సహా సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో పని చేసిన కార్మికులకు, అదేవిధంగా సఫాయి కర్మచారులకు లేదా పారిశుద్ధ్య కార్మికులకు కూడా ఆహ్వానం పంపారు. బలమైన భారతదేశాన్ని నిర్మించడానికి బలమైన రాయబారులుగా వందే భారత్ రైళ్లు, మెట్రో ప్రాజెక్ట్ వంటి కీలక ప్రాజెక్టులలో రైల్వేలో పని చేసిన వ్యక్తులకు కూడా ఆహ్వానం పంపనున్నట్లు తెలిసింది. వికసిత్ భారత్‌కు రాయబారులుగా పనిచేసిన అనేక మందిని కూడా వేడుకకు ఆహ్వానించారు. ‘బలమైన దేశాన్ని నిర్మించడంలో పాలుపంచుకున్న ప్రతి రాయబారి సహకారాన్ని ప్రధాన మంత్రి గౌరవిస్తారనే పేరుంది. వీఐపీలు, వీవీఐపీలకు మాత్రమే ఆహ్వానాలు పంపే రోజులు పోయాయి. మా ప్రధాన మంత్రి ఎన్నడూ ప్రాముఖ్యతను పొందని వారిని వీఐపీ అతిథులుగా పరిగణిస్తారు’ అని ఆ వర్గాలు వెల్లడించాయని వార్తా సంస్థ పేర్కొంది. నివేదికల ప్రకారం, రాష్ట్రపతి భవన్‌లో 8 వేల మందికి పైగా అతిథుల కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ ‘ప్రచండ’, భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే, మారిషస్ ప్రధాని ప్రవింద్ జుగ్నాథ్‌కు, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేకు కూడా ఆహ్వానాలు పంపినట్లు సమాచారం.

నకిలీ ఆధార్‌తో పార్లమెంటులోకి...

ముగ్గురి అరెస్టు

న్యూఢిల్లీ: నకిలీ ఆధార్ కార్డులతో పార్లమెంట్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ముగ్గురిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం ముగ్గురు వ్యక్తులు నకిలీ ఆధార్ కార్డుల సాయంతో పార్లమెంట్ భవనం గేట్ నంబర్ 3 ద్వారా లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. వారి కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో భద్రతా సిబ్బంది వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు నిందితులు కాసిం, మోనిస్, సోయెబ్‌గా గుర్తించారు. వీరు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన కూలీలుగా విచారణలో తేలింది. ఈ మేరకు ముగ్గురిని అరెస్ట్ చేసి ఫోర్జరీ, మోసం కింద కేసులు బుక్ చేశారు. అరెస్టయిన ముగ్గురు వ్యక్తులు మూడు నెలలుగా పార్లమెంట్ సముదాయంలోని ఎంపీ లాంజ్‌ను నిర్మించేందుకు కాంట్రాక్ట్ తీసుకున్న డీవీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌లో పని చేస్తున్నట్లు సమాచారం. గత ఏడాది డిసెంబరు 13న 2001 పార్లమెంట్ దాడి వార్షికోత్సవం సందర్భంగా ఇద్దరు వ్యక్తులు పబ్లిక్ గ్యాలరీ నుంచి లోక్‌సభ ఛాంబర్‌లోకి దూకి, పార్లమెంటు సభ్యుల మధ్య పసుపు రంగు పొగను వెదజల్లుతున్న డబ్బాలను తెరిచి భయాందోళనలకు గురిచేసిన సంఘటన ఆరు నెలల తర్వాత జరిగింది. భవనం వెలుపల, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడిన మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. మొత్తం ఉల్లంఘన కుట్రలో అరెస్టయిన ఆరుగురు మనోరంజన్ డి, సాగర్ శర్మ, అమోల్ ధనరాజ్ షిండే, నీలం రనోలియా, లలిత్ ఝా మరియు మహేష్ కుమావత్

పరాజయానికి బాధ్యత వహిస్తా

ఎమ్మెల్యేలందరూ నా వెంటే
ఎన్‌సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్



ముంబై : లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ పేలవ ప్రదర్శనకు, ప్రతిష్ఠాత్మక పోరుగా భావించే బారామతిలో ఓటమికి పూర్తి బాధ్యత వహిస్తున్నట్లు ఎన్‌సీపీ అధ్యక్షుడు, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ స్పష్టం చేశారు. తన పార్టీ ఎమ్మెల్యేల సమావేశం తర్వాత విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ, శాసనసభ్యులందరూ తన వెంటే ఉన్నారని, కొందరు శరద్ పవార్ నేతృత్వంలోని వర్గానికి ఫిరాయించాలని యోచిస్తున్నారనే ఊహాగానాలను పవార్ తోసిపుచ్చారు. ప్రతిపక్షాలు ఏమైనా మాట్లాడగలవని, నాకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉందని, నా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎప్పుడూ నాకు అండగా ఉంటారని హామీ ఇచ్చారు. సిట్టింగ్ ఎంపీ సుప్రియా సూలే తన సతీమణి సునేత్రా పవార్‌పై భారీ మెజార్టీతో గెలుపొందిన బారామతి గురించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ‘నాకు ఎల్లప్పుడూ అక్కడి ప్రజల మద్దతు ఉన్నందున ఫలితం ఆశ్చర్యకరంగా ఉంది’ అని అన్నారు. ఎన్‌సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్‌తో మరోసారి చేతులు కలుపుతారా అని ప్రశ్నించగా, ఎన్నికల పరాజయానికి తాను బాధ్యత వహిస్తున్నానని, ‘కుటుంబ విషయాలను బహిరంగంగా తీసుకురావాల్సిన అవసరం లేదు’ అని అన్నారు. పార్టీ ఎన్నికల పనితీరుపై వివరణాత్మక ఆత్మపరిశీలన ఉంటుందని నొక్కిచెప్పిన ఎన్‌సీపీ అధ్యక్షుడు... ముస్లింలు పాలక కూటమి నుంచి వైదొలగడం, దళితులు, వెనుకబడిన తరగతులను దూరం చేసిన రాజ్యాంగంలో మార్పుపై ప్రతిపక్షాల ఆరోపణలు, అలాగే కొనసాగుతున్న మరాఠ్వాడాలో కొనసాగుతున్న మరాఠాల కోటా కలంకలం కొన్ని కారణాలని చెప్పారు. ఫలితాలపై తాను ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో చర్చించానని, ప్రజల మద్దతును తిరిగి పొందేందుకు తగిన నిర్ణయాలు తీసుకుంటామని పవార్ చెప్పారు. ఎన్నికల ఓటమి ప్రజలు ఫిరాయింపులను ఆమోదించడం లేదని సందేశం ఇచ్చారా అని ప్రశ్నించగా, షిండే నేతృత్వంలోని శివసేన పోటీ చేసిన 15 స్థానాల్లో ఏడింటిని గెలుచుకుందని పవార్ చెప్పారు. ‘మహారాష్ట్రకు ఫిరాయింపులు కొత్త కాదు. 1978లో కూడా అదే జరిగింది’ అని శరద్ పవార్ చేసిన చర్యను ప్రస్తావించారు. అజిత్ పవార్, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు షిండే ప్రభుత్వంలో చేరిన తర్వాత గత ఏడాది జులైలో ఎన్‌సీపీ చీలిపోయింది.

విరుదునగర్‌లో రీకౌంటింగ్ జరపాలి

ప్రేమలత డిమాండ్

చెన్నై: తమిళనాడులోని విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గంలో రీకౌంటింగ్ జరపాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత డిమాండ్ చేశారు. కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ తమ పార్టీ తరఫున విరుదునగర్‌లో పోటీ చేసిన కెప్టెన్ విజయకాంత్ తనయుడు విజయ ప్రభాకర్ ఓడిపోలేదని, కొందరి కుట్రకారణంగా ఓడించబడ్డాడని ఆరోపించారు. కౌంటింగ్ చురుకుగా సాగుతుండగా ఉన్నట్టుండి మధ్యాహ్నం 3 నుండి 5 గంటల దాకా కౌంటింగ్ నిలిపివేశారని, అదేసమయంలో ఎన్నికల అధికారిగా ఉన్న జిల్లా కలెక్టర్ తనపై తీవ్ర ఒత్తిడి పెరిగిందంటూ సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంచారన్నారు. తమ పార్టీ ఎన్నో ఎన్నికలను ఎదుర్కొన్నదని, అయితే విరుదునగర్ కౌంటింగ్ సమయంలో జరిగినంత అక్రమాలను ఎన్నడూ చూడలేదన్నారు. విరుదునగర్‌లో రీకౌంటింగ్ జరపాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. 13వ రౌండ్ ఓట్ల లెక్కింపు సమయంలోనే అక్రమాలు జరిగాయని ఆమె ఆరోపించారు. రిటైర్డ్ జడ్జి సమక్షంలో విరుదునగర్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు మళ్లీ జరపాలని ప్రేమలత డిమాండ్ చేశారు. భోజన విరామ సమయం తర్వాత రెండు గంటలపాటు కౌంటింగ్ నిలిపివేయడానికి గల కారణాలను అధికారులు వివరించాలని ఆమె డిమాండ్ చేశారు.

మాణిక్కం ఠాగూర్ ఖండన

విరుదునగర్ ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయంటూ ప్రేమలత ఆరోపించడాన్ని ఆ నియోజకవర్గంలో గెలిచిన కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాగూర్ ఖండించారు. ఓట్ల లెక్కింపు ముగిసిన తరువాత డీఎండీకే అభ్యర్థి, ఆయన ఏజెంట్లు ప్రశాంతంగా వెళ్లిపోయారని, అక్రమాలు జరిగి ఉంటే అప్పుడే ఫిర్యాదు చేసి ఉండాలని తెలిపారు. కౌంటింగ్‌లో అవినీతి, అక్రమాలు జరగలేదని ఆయన వివరించారు.

అన్నామలై నోటి దురుసుతోనే...

బీజేపీతో బంధం తెగడంపై అన్నా డీఎంకే నేత

చెన్నై: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నోటి దురుసు వల్లే రెండు పార్టీల మధ్య బంధం తెగిపోయిందని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి విమర్శించారు. కోవైలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వేలుమణి మాట్లాడుతూ రెండు కోట్ల మందికి పైగా సభ్యులున్న అన్నాడీఎంకే పార్లమెంటుకు, అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో విజయావకాశాలు కోల్పోయి మళ్లీ బలం పుంజుకుందన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ... 2021 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా వ్యవహరిస్తోందని తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓడినా ఓటు బ్యాంక్ ఏ మాత్రం చెక్కు చెదరలేదని, ఓటమిపై పార్టీ అధిష్ఠానం సమీక్ష నిర్వహిస్తుందని తెలిపారు. అన్నాడీఎంకే గురించి అన్నామలై చేసిన విమర్శల వల్లే ఈ ఎన్నికల్లో కూటమి ఏర్పడలేదని, ఒకవేళ రెండు పార్టీలు ఒకే కూటమిలో ఉన్నట్లయితే 30 పార్లమెంటు నియోజకవర్గాల్లో విజయావకాశాలుండేవన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో మళ్లీ ప్రజలు మెచ్చే ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని వేలుమణి ధీమా వ్యక్తం చేశారు.

ఎన్డీయేే ప్రభుత్వం కొనసాగలేదు

జేడీ(యూ), టీడీపీ ఎప్పుడైనా మద్దతు ఉపసంహరించుకోవచ్చు: రౌత్



ముంబై: ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటవుతుందని కానీ అది ఎక్కువ కాలం కొనసాగలేదని, జేడీ(యూ), టీడీపీ ఏ సమయంలోనైనా మద్దతును ఉపసంహరించుకోవచ్చని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ అన్నారు. ఈ ప్రభుత్వాన్ని నడిపించడం ప్రధాని మోదీకి సవాళ్లభరితమన్నారు. ‘జేడీ(యూ), టీడీపీ అధ్యక్షుడు నితీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు వంటి నాయకులు నిజంగా వారికి మద్దతిస్తున్నారా? ఇప్పుడు ఇస్తున్నారేమోగానీ రేపు ఇవ్వకపోవచ్చు. మాతో కలిసి రావచ్చు’ అని రౌత్ అన్నారు. అగ్నివీర్ పథకాన్ని జేడీ(యూ) నేతలు వ్యతిరేకిస్తున్నారని, ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)పై చర్చలు కోరుతున్నారని గుర్తుచేశారు. అనేక అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని, ఏకాభిప్రాయం కుదరడం కష్టమన్నారు. వీరి కూటమి ఎక్కువ కాలం కొనసాగడం ప్రశ్నార్థకమేనని రౌత్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా యూసీసీ, అగ్నివీర్ పథకం గురించి మోదీ చెప్పిన దాన్ని మిత్రపక్షాలే వ్యతిరేకిస్తున్నాయని, రామ మందిరంపైనా త్వరలో అభ్యంతరాలు రావచ్చన్నారు. ‘ఇండియా ఐక్య సంఘటన అధికారంలోకి వస్తే ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తారని మోదీ ప్రచారం చేశారు. చంద్రబాబు కూడా రిజర్వేషన్లను సమర్థించారు. మరిప్పుడు మోదీ ఏం చేస్తారు? చాలా అంశాలు చర్చల్లో ఉన్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు... చేయనివ్వండి’ అని రౌత్ అన్నారు. హోంమంత్రి అమిత్‌షాపైనా విమర్శలు చేశారు. కాంగ్రెస్ లేని భారత్‌ను బీజేపీ కోరుకుంది కానీ బీజేపీకి మెజారిటీ రాకుండా మేము చేశామన్నారు. స్టాక్ మార్కెట్ కుంభకోణం గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ షేర్ మార్కెట్ వ్యవహారాల్లో అమిత్‌షా క్రియాశీల పాత్ర పోషించారని, హోంమంత్రిగా ఉండి కూడా ఆయన ఇలా చేశారని, కుంభకోణానికి ఆయన కూడా జవాబుదారీ వహించాలన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ తమ కూటమి రాణిస్తుందని రౌత్ విశ్వాసంగా చెప్పారు. మహా వికాస్ అగాడీ (ఎంవీఏ) లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి గట్టి పోటీ ఇచ్చి... మెజారిటీ సాధించిందని, 180-185 అసెంబ్లీ స్థానాలను సాధించడమే తమ లక్ష్యమని రౌత్ వెల్లడించారు. పెద్దన్నగా ఎవరూ లేరని, ఒకరికొకరం మద్దతుగా నిలుస్తున్నామని, నానా పటోలే, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే కలిసి ప్రచారం చేశారని, ఉమ్మడి విజయాన్ని సాధించారనని రౌత్ తెలిపారు. కాగా, 288 స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీకి అక్టోబరులో ఎన్నికలు జరగనున్నాయి.

ఎంపీలకు సదుపాయాలెన్నో!

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యాయి. కేంద్రంలో కొత్త సర్కార్ కొలువుదీరబోతోంది. రాష్ట్రాల్లో ఎంపీలుగా ఎన్నికైన వారే కేంద్రంలో సర్కార్‌ని ఎన్నుకుంటారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి 293 సీట్లు రాగా, ఇండియా ఐక్య సంఘటనకు 232 సీట్లు వచ్చాయి. అయితే ఎంపీల జీతం ఎంత అనే వివరాలు తెలుసుకుందాం. ఎంపీల నెలజీతం లక్షరూపాయలు ఉంటుంది. అలవెన్సులు, ప్రోత్సాహకాలను పరిశీలిస్తే...ఎంపీలు నియోజకవర్గ భత్యం రూపంలో నెలకు రూ.70 వేలు అందుకుంటారు. కార్యాలయ ఖర్చుల కోసం నెలకు రూ.60 వేలు లభిస్తుంది. ఇందులో స్టేషనరీ సామగ్రి, సిబ్బంది జీతాలు ఉంటాయి. పార్లమెంటరీ సెషన్‌లు, కమిటీ సమావేశాల సమయంలో ఎంపీలు బస చేయడానికి, వారి ఆహార ఖర్చుల కోసం రోజుకు రూ.2,000 భత్యం ఇస్తారు. అలాగే, ఏడాదిలో 34 సార్లు ఎంపీతో పాటు ఆయన భార్యకు ఉచిత విమాన ప్రయాణం కల్పిస్తారు. అధికారిక, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉచిత ఫస్ట్-క్లాస్ రైలు ప్రయాణం ఉంటుంది. ఎంపీలు తమ నియోజకవర్గాల పరిధిలో రోడ్డు మార్గంలో ప్రయాణించేటప్పుడు మైలేజ్ అలవెన్సులు అందుకుంటారు. ఇక ఎంపీలకు ఐదేళ్ల పదవీకాలంలో ప్రధాన ప్రాంతాల్లో అద్దె రహిత వసతి ఇస్తారు. సీనియారిటీ ఆధారంగా బంగ్లాలు, ఫ్లాట్లు, హాస్టల్ గదుల్లో ఉచిత వసతి లభిస్తుంది. అధికారిక వసతి వద్దనుకున్న ఎంపీలకు నెలకు రూ.2 లక్షల గృహ భత్యం క్లెయిమ్ చేసుకోవడానికి వీలుంది. ఎంపీలు, వారి కుటుంబ సభ్యులు కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం కింద ఉచిత వైద్య సంరక్షణకు అర్హులు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స, పథకం కింద వచ్చే ప్రైవేట్ ఆసుపత్రులూ ఉంటాయి. పదవి కోల్పోయిన అనంతరం రూ.50 వేల పింఛన్ పొందుతారు. ప్రతి ఏడాది నెలకు రూ.2,000 ఇంక్రిమెంట్ పొందుతారు. మూడు టెలిఫోన్లు ఉపయోగించుకోవచ్చు. వాటిని ఇష్టమైన చోట ఏర్పాటు చేసుకోవచ్చు. ఎంపీలకు ఏడాదికి రూ.1.50 లక్షల టెలిఫోన్ కాల్‌లు ఉచితం. వారు తమ నివాసాలు, కార్యాలయాలలో ఉచిత హై-స్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్‌లు ఉపయోగించుకోవడానికి అర్హులు. ఎంపీలకు ఏటా 50 వేల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 4 వేల కిలో లీటర్ల వరకు ఉచిత నీరు అందిస్తారు.

ఒడిశా అసెంబ్లీలో కొత్త ముఖాలు

ఎక్కువమంది యువనేతలే..దిగ్గజాలనే ఓడించారు
ఒకప్పటి దినసరి కూలీ చేతిలో సీఎంకు పరాజయం



భువనేశ్వర్: ఒడిశా అసెంబ్లీకి ఎన్నికైన వారిలో చాలా మంది కొత్తవారే. వారిలో ఎక్కువ మంది యువ రాజకీయ నాయకులు. ఇందులో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మణ్ బాగ్... బీజేపీకి చెందిన ఇతను ఐదుసార్లు ముఖ్యమంత్రి అయిన నవీన్ పట్నాయక్‌ను కాంటాబంజీ అసెంబ్లీ నియోజకవర్గం నుండి 16వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఓడించి రాత్రికి రాత్రే సెలబ్రిటీ అయ్యారు. పట్నాయక్ తన సాంప్రదాయ నియోజకవర్గమైన గంజామ్‌లోని హింజిలితో పాటు పోటీ చేసిన స్థానమే పశ్చిమ ఒడిశాలోని బోలంగీర్ జిల్లాలోని కాంటాబంజీ నియోజకవర్గం. ఈ స్థానంలోనే లక్ష్మణ్‌బాగ్ ఎవరూ ఊహించని రీతిలో ఓటమెరుగని రాజకీయ దిగ్గజానికి ఓటమి రుచి ఎలా ఉంటుందో చూపించాడు. 48 ఏళ్ల బాగ్ ఒకప్పుడు కాంటాబంజీలో రోజువారీ కూలీగా జీవనోపాధి పొందారు. ఆయన 2014, 2019లో రెండుసార్లు ఇదే నియోజకవర్గం నుంచి అదృష్టాన్ని పరీక్షించుకుని విఫలమయ్యారు. ఈసారి మాత్రం పేదరికం, నిరుద్యోగం, కార్మికుల వలసలు వంటి ముఖ్యమైన సమస్యలపై విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా ఛత్తీస్‌గఢ్‌కు దగ్గరగా ఉన్న ఈ ప్రాంతం నుండి గెలిచారు. పట్నాయక్ మితిమీరిన ఆత్మవిశ్వాసం కూడా బాగ్ విజయానికి సహాయపడింది, కాంటాబంజీలో సీఎం నవీన్ పట్నాయక్ పెద్దగా ప్రచారం చేయలేదు. కాగా 24 ఏళ్లపాటు విరామం లేకుండా రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రిని ఓడించడం ఓ విజయమైతే... ఆయనపై బాగ్ 16,344 ఓట్ల మెజారిటీ సాధించడాన్ని ఆయన సొంత పార్టీ నాయకులను కూడా ఆశ్చర్యపరిచింది. ఇక బిజూ జనతాదళ్ (బీజేడీ) ముఖ్యనేత, మంత్రి అటాను సవ్యసాచి నాయక్‌ను మహాకలపాడలో 33వేల ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి దుర్గాప్రసన్న నాయక్ ఓడించారు. ఇతను కూడా మొట్టమొదటి సారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. అటానుతో పోలిస్తే అనుభవం లేని వ్యక్తి అయినప్పటికీ బీజేపీలో మంచి ఆర్గనైజర్‌గా పేరుగాంచారు. తీరప్రాంత నియోజకవర్గంలో సాంప్రదాయకంగా బీజేడీకి ఓటు వేసే బెంగాలీ సెటిలర్లను ఆకర్షించడంలో విజయం సాధించారు. మరో కొత్త ఎమ్మెల్యే భద్రక్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సితాన్సు శేఖర్ మహపాత్ర. 16వేల ఓట్ల తేడాతో బీజేడీ సీనియర్ నేత, మాజీ మంత్రి ప్రఫుల్ల సమాల్‌పై విజయం సాధించారు. ఇక్కడ బీజేడీ వ్యవస్థాపకుల్లో ఒకరైన సమాల్ విజయం నల్లేరుమీద నడకగా భావించినప్పటికీ సితాన్సు ప్రజలతో మమేకమై విస్తృత ప్రచారం నిర్వహించడం ద్వారా విజయం సాధించగలిగారు. ఇక పూరిలో, బీజేడీ నుంచి తొలిసారి పోటీచేసిన సునీల్ కుమార్ మొహంతి బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే జయంత కుమార్ సారంగిపై 5వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేకసార్లు పూరి సీటును గెలుచుకున్న ఒడిశా మాజీ అసెంబ్లీ స్పీకర్, మంత్రి మహేశ్వర్ మొహంతి కుమారుడైన సునీల్... విజయం కోసం చెమటోడ్చాల్సి వచ్చింది. అదేవిధంగా, మాజీ మంత్రి బిజోయ్ మహాపాత్ర కుమారుడు అరవింద్ మహాపాత్ర... బీజేడీ టికెట్‌పై పాట్కురా అసెంబ్లీ స్థానంలో పోటీ చేసి బీజేపీకి చెందిన తేజేశ్వర్ పరిదాపై 13,000 ఓట్ల పైచిలుకు మెజారిటీతో విజయం సాధించారు. 1980 నుండి 1995 వరకు వరుసగా నాలుగు సార్లు పాట్కురాకు ప్రాతినిధ్యం వహించి... మళ్లీ ఆ స్థానంలో గెలవ లేకపోయిన తన తండ్రి కలను అరవింద్ ఈ విధంగా నెరవేర్చాడు. ఇక మొట్టమొదటిసారి అసెంబ్లీలో కాలుమోపిన వారిలో బీజేడీకి చెందిన గౌతమ్ బుద్ధదాస్ ... బాలాసోర్ జిల్లాలోని భోగ్రాయ్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్‌కు చెందిన తన సమీప ప్రత్యర్థి సత్య శిబాదాస్‌ను 6,564 ఓట్ల తేడాతో ఓడించారు. అదేవిధంగా ప్రతిష్ఠాత్మక జగత్‌సింగ్‌పూర్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా అరంగేట్రం చేసిన అమరేంద్ర దాస్ విజయం సాధించారు. ఆయన 22,138 ఓట్ల తేడాతో బీజేడీ సీనియర్ నేత ప్రశాంతకుమార్ ముదులిపై విజయం సాధించారు. రాజకీయ కుటుంబాలకు చెందిన కొంతమంది మహిళా అభ్యర్థులు విజయం సాధించారు. తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన మహిళల్లో ప్రముఖంగా చెప్పుకోవాల్సింది సోఫియా ఫిర్దౌస్, ఆమె కటక్-బారాబతి స్థానంలో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసి 8,000 ఓట్ల తేడాతో బీజేపీకి చెందిన పూర్ణ చంద్ర మహాపాత్రను ఓడించారు.

సివిల్ ఇంజనీర్, రియల్ ఎస్టేట్ సంస్థ డైరెక్టర్ అయిన 32 ఏళ్ల సోఫియా... తన తండ్రి మహ్మద్ మొక్విమ్‌ను రుణం ఎగ్గొట్టిన కేసులో ఇరుక్కోవడంతో ఆయన స్థానంలో పోటీచేశారు. గత సంవత్సరం, కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, భువనేశ్వర్ చాప్టర్ అధ్యక్షురాలిగా సోఫియా ఎన్నికయ్యారు. తన తండ్రి కోటను పదిలంగా ఉంచడం ఇప్పుడు ఆమె బాధ్యత. ఈ ఎన్నికల్లో అరంగేట్రం చేసిన మరో మహిళ ఉపాసన మహాపాత్ర, బ్రహ్మగిరి అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ టికెట్‌పై గెలుపొందారు, ఆమె సమీప ప్రత్యర్థి బీజేడీకి చెందిన ఉమాకాంత సామంతరాయ్‌ను 9,830 ఓట్లతో ఓడించారు. ఉపాసన దివంగత కాంగ్రెస్ సీనియర్ లాలతేందు బిద్యాధర్ మోహపాత్ర అకా లులు కుమార్తె.

మధ్యప్రదేశ్‌లో అమానవీయం

దళిత సర్పంచ్‌ను చెట్టుకు కట్టేసి కొట్టిన వైనం

మొరేనా: మధ్యప్రదేశ్‌లోని మొరేనాలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. దళిత సర్పంచ్‌ను కొందరు ఆగంతకులు చెట్టుకు కట్టేసి విచక్షణారహితంగా కొట్టారు. స్వగ్రామాన్ని విడిచి వెళ్లాలని బలవంత పెట్టారు. పోలీసు అధికారి శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం కౌథర్కలన్ పంచాయత్ సర్పంచ్ గురువారం పోర్సా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను కొందరు వేధిస్తున్నారని, పదవిని, గ్రామాన్నీ వదిలి వెళ్లాలని, తన డిజిటల్ సంతకం, పాస్‌వర్డ్ ఉన్న డాంగిల్ (పెన్‌డ్రైవ్ తరహా పరికరం)ను అప్పగించాలని బలవంతం చేస్తున్నట్లు తెలిపారు. వారి డిమాండ్లకు అంగీకరించకపోవడంతో గ్రామ శివార్లకు తీసుకెళ్లి అక్కడ ఓ చెట్టుకు కట్టేసి కొట్టారని తెలిపారు. సర్పంచ్ ఫిర్యాదు ఆధారంగా దివాకర్ సింగ్ తోమర్, అతని సోదరుడు పింకూపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దివాకర్‌ను అరెస్టు చేశారు. ఈమేరకు అంబా సబ్ డివిజనల్ అధికారి రవీ భదోరియా తెలిపారు. సర్పంచ్ కుటుంబం గోహద్ పట్టణానికి వెళ్లిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కొందరు వ్యక్తులు తనను వేధిస్తున్నందునే గ్రామాన్ని వదిలి వెళుతున్నట్లు సర్పంచ్ తనతో చెప్పారని పంచాయతీ కార్యదర్శి బల్వీర్ సికర్వార్ వెల్లడించారు.

రాహుల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'

- లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఆయనే ఉండాలి
- ఈసారి ఎన్‌డీఏ నిస్సహాయ ప్రభుత్వం
- కాంగ్రెస్ నేత శశి థరూర్

న్యూఢిల్లీ: రాహుల్ గాంధీ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశి థరూర్ ప్రశంసించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఆయనే ఉండాలని అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా నాల్గవ సారి విజయం సాధించిన తర్వాత ఆయన పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ బీజేపీ అధిక అహంకారానికి ఓటర్లు ఇచ్చిన తీర్పునకు సంబంధించిన సందేశం అన్నారు. 'తమ ప్రభుత్వాన్ని నడిపించడంలో పెద్దగా సంప్రదింపులు జరపని నరేంద్ర మోదీ, అమిత్ షాకు ఇది ఒక సవాలుగా ఉంటుంది. ఇది వారి పనితీరును మార్చుకునే, మరింత అనుకూలమైన, మరింతగా ఉండే వారి సామర్థ్యాన్ని పరీక్షించబోతోందని నేను భావిస్తున్నాను. ప్రభుత్వంలో సామరస్యం, ప్రతిపక్షంతో కూడా నేను ఆశిస్తున్నాను' అని థరూర్ రాబోయే ఎన్‌డీఏ సంకీర్ణ ప్రభుత్వం గురించి మాట్లాడుతూ అన్నారు. ఈసారి మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కొన్ని విషయాలలో 'మజ్బూర్ సర్కార్' (నిస్సహాయ ప్రభుత్వం) అని నిరూపించగలదని, ఎందుకంటే ఎన్‌డీఏలో భాగమైన పార్టీలు ప్రతిదానికీ అంగీకరించాలని కేంద్ర మాజీ మంత్రి తెలిపారు. 'అగ్నివీర్ పథకంపై ఇప్పటికే ఒక పార్టీ ప్రశ్నలు లేవనెత్తుతోంది. దానిని సమీక్షించాల్సిన అవసరం ఉందని, వారికి మద్దతు ఇస్తున్న జేడీ(యూ), చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన రెండవ పార్టీ చెబుతోంది. ఆంధ్ర ప్రదేశ్, బీహార్‌లో తమ రాష్ట్రాలకు ప్రత్యేక తరగతి హోదా ఇవ్వాలని డిమాండ్ చేసిన నాయకులు ఉన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వడానికి నిరాకరించింది. దానిని పునఃపరిశీలించవలసి ఉంటుంది' అని చెప్పారు. అయితే ఇప్పుడు ఆకస్మాత్తుగా మరింత ఏకాభిప్రాయ మోడల్ గవర్నెన్స్ రావాల్సి ఉంటుందని అంటున్నారని థరూర్ అన్నారు. మోదీ ప్రభుత్వం గత 10 ఏళ్లలో పార్లమెంటును నోటీసు బోర్డులా పరిగణిస్తోందని, వారి నిర్ణయాలన్నింటికీ ఇది రబ్బర్ స్టాంప్‌గా ఉంటుందని, 230 మందికి పైగా ఎంపీల బలమైన వ్యతిరేకతతో ఇప్పుడు ఇది ఆచరణ సాధ్యం కాదని ఆయన అన్నారు. 'ఇటీవల జరిగిన ఎన్నికల్లో కొన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఎదురైంది. నా విషయమే చూసుకుంటే... నా నియోజకవర్గంలో పోటీ 'సూపర్ ఓవర్' కు ఉంది. మెజార్టీ ఎందుకు తగ్గిందనే దానికి చాలా కారణాలుంటాయి. ఏదేమైనా చివరకు విజయం విజయమే. ఆ తీపిని నేను ఆస్వాదిస్తున్నా' అని థరూర్ వ్యాఖ్యానించారు. ఇక రాహుల్ గాంధీ గురించి స్పందిస్తూ... ఈ ఎన్నికల్లో ఆయనే 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అని ప్రశంసించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఆయనే ఉండాలని అభిప్రాయపడ్డారు. కొన్ని స్థానాల్లో కాంగ్రెస్

అద్భుతమైన ప్రదర్శన చేసిందన్నారు. 'రాహుల్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేశారు. ప్రస్తుతం ఖర్గేజీ రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే లోక్‌సభలో మాకు బలమైన ప్రాతినిధ్యం ఉంది. ప్రభుత్వాన్ని ఎదుర్కోవాలంటే కచ్చితంగా ప్రజాదరణ కలిగిన నాయకుడు ప్రతిపక్ష నేతగా ఉండాలి. అందుకు రాహుల్ సరిగ్గా సరిపోతారు' అని థరూర్ అభిప్రాయం వ్యక్తంచేశారు. క్రికెట్ భాషను ఉపయోగిస్తూ, 'కొన్ని చోట్ల మేము టైట్ ఫినిష్ చేసాము. నా విషయంలో నా నియోజకవర్గంలో టి 20 ముగింపులో సూపర్ ఓవర్ జరిగింది. అన్ని చోట్లా చాలా క్రికెట్ సారూప్యతలు ఉన్నాయి. కానీ ప్రపంచ టి20 లో మనం చూస్తున్నట్లుగా, కొన్ని ఆందోళనలు ఉన్నాయి. మేము బ్యాటింగ్ చేయాల్సిన పిచ్ గురించి, మేము ఇచ్చిన పిచ్‌పై ఆడటం తప్ప వేరే మార్గం లేదని నేను చెబుతాను. అయితే ఇది కచ్చితంగా దాని కంటే చాలా ఎక్కువ స్థాయి ఆట మైదానం కావచ్చు' అని అన్నారు. కేరళలోని తిరువనంతపురంలో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌పై థరూర్ 16,077 ఓట్లతో విజయం సాధించారు. 'క్యాబినెట్‌తో సంప్రదింపులు లేదా సమాచారం లేకుండా ప్రకటించబడిన నోట్ల రద్దు నుంచి, కొన్ని గంటల నోటీసుతో వచ్చిన కఠినమైన లాక్‌డౌన్ వరకు, రాష్ట్ర ముఖ్యమంత్రులను కూడా సంప్రదించకుండా మేము ప్రతిదీ చూశాము. స్వదేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా మన ప్రజాస్వామ్యానికి అపఖ్యాతిని తెచ్చిపెట్టిన ఒక రకమైన నిరంకుశ పాలనకు ముగింపు పలకాలని చూస్తున్నాం' అని థరూర్ అన్నారు. ప్రభుత్వం ఇప్పుడు సంకీర్ణంగా ఉందని, ప్రధాన నిర్ణయాలకు ముందు ప్రధాని కూటమి భాగస్వాములను సంప్రదించాల్సి ఉంటుందని, లేని పక్షంలో ప్రభుత్వం మనుగడ సాగించదని కాంగ్రెస్ నేత అన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ తన సంఖ్యను 99కి మెరుగుపరుచుకోవడం ద్వారా సాధించిన విజయాలను ప్రశంసించిన థరూర్, ఇది చాలా మంచి పనితీరు అని, మేము క్షేత్ర స్థాయిలో చూసిన దాని ప్రకారం సంఖ్యలు కనిపించడం పట్ల నాయకులు చాలా సంతోషిస్తున్నారని అన్నారు.

సీపీఐకి 'ఏటుకూరి' రూ.25 వేల విరాళం

సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కమ్యూనిస్టు ఉద్యమ నేత, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, శతాధిక వృద్ధులు ఏటుకూరి కృష్ణమూర్తి (102) ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితికి రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో ఉంటున్నారు. గుంటూరు జిల్లా ఏటుకూరు గ్రామంలో 1922లో జన్మించిన కృష్ణమూర్తి చిన్ననాటి నుంచే కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అనేకసార్లు జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్య పోరాట యోధులు చంద్రశేఖర్ ఆజాద్ పిలుపుతో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటీష్ ఆర్మీలో చేరి, వారికి వ్యతిరేకంగా బొంబాయిలో జరిగిన రాయల్ ఇండియా నేవీ సైనికుల పోరాటానికి సంఘీభావంగా ప్రత్యేక పార్టీ సెల్ ఏర్పాటు చేశారు. దానిపై ఆయనకు బ్రిటీషు ఆర్మీ ఏడు నెలలపాటు పాకిస్థాన్ లాహోర్ జైలులో నిర్బంధించి కోర్టు మార్షల్ విధించారు. ఆ శిక్ష నుంచి తప్పించుకుని వచ్చిన ఏటుకూరి ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూశాఖలో ఉద్యోగిగా చేరారు. ఆ సమయంలో ఉద్యోగ హక్కుల కోసం పోరాడి ఎన్జీవో అసోసియేషన్‌లో కీలక నేతగా ఎదిగారు. ప్రస్తుతం 102 సంవత్సరాల వయస్సులోనూ ఆయన కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తూ...రూ.25వేల విరాళాన్ని అందజేయడం అభినందనీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు.

గెలుపు దిశగా తీన్మార్ మల్లన్న

విశాలాంధ్ర-హైదరాబాద్: వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు తుదిదశకు చేరుకుంది. 50 మంది అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోటాకి దగ్గరయ్యారు. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ కుమార్, స్వతంత్ర అభ్యర్థి అశోక్ కుమార్ ఎలిమినేషన్‌కి గురయ్యారు. ప్రస్తుతం పోటీలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి మాత్రమే ఉన్నారు. కాగా తీన్మార్ మల్లన్న ఆధిక్యంలో కొనసాగుతున్నారు. గెలుపు కోటాకి దగ్గరలో ఉన్నారు. గెలుపు కోటా చేరుకోకపోతే రాకేష్ రెడ్డిని ఎలిమినెట్ చేయనున్నారు. తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయం కావడంతో అతని అనుచరులు సంబురాలు చేసుకుంటున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో గెలుపునకు సరిపడా ఓట్లు ఎవరికీ రాలేదు. దీంతో గురువారం రాత్రి నుంచి రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు, ఎలిమినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ నెలకొనగా... ఆ పార్టీల తరపున బరిలో దిగిన అభ్యర్థులు లెక్కింపు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఫలితాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం బీజేపీ, స్వతంత్ర అభ్యర్థి అశోక్ ఎలిమినేషన్ తర్వాత మల్లన్న గెలుపు ఖాయమనే అంచనాలు ఊపందుకున్నాయి.

10న సిక్కిం సీఎంగా తమాంగ్ ప్రమాణం

గ్యాంగ్‌టక్: సిక్కిం ముఖ్యమంత్రిగా పీఎస్ తమాంగ్ వరుసగా రెండవసారి పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. 10వ తేదీ అనగా సోమవారం పల్జోర్ మైదానంలో తమాంగ్‌తో పాటు కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం జరగబోతోంది. ఈ మేరకు సీఎం అధికారిక నివాసంలో శుక్రవారం జరిగిన సిక్కిం క్రాంతికారీ మోర్చా (ఎస్‌కేఎం) శాసనసభాపక్ష సమావేశం నిర్ణయించింది. ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యేందుకు తమాంగ్ శనివారం దిల్లీకి బయల్దేరనున్నట్లు పార్టీ నేత తెలిపారు. మోదీకి మద్దతివ్వాలని ఎస్‌కేఎం ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా తీర్మానించినట్లు వెల్లడించారు.

తగ్గిన నోటా ఓట్ల శాతం: ఈసీ

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో జాతీయస్థాయిలో 'నోటా' (పైన పేర్కొన్న అభ్యర్థులు ఎవరూ కాదు) ఓట్ల శాతం తగ్గినట్లు ఎన్నికల కమిషన్ (ఈసీ) శుక్రవారం ప్రకటించింది. అయితే ఈ ధోరణికి భిన్నంగా ఈశాన్య రాష్ట్రాల్లో నోటా ఓట్ల శాతం పెరిగినట్లు తెలిపింది. 2024 ఎన్నికల్లో 0.99 శాతం నోటా ఓట్ల శాతం రికార్డయినట్లు ఈసీ వెల్లడించింది. 2019 ఎన్నికల్లో 1.06 శాతం నోటా ఓట్లు పోలవగా... గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో 0.07 శాతం తగ్గినట్లు తెలిపింది. ఈశాన్య రాష్ట్రాల్లో నోటా ఓట్ల శాతం సగటున 2019లో 0.71 శాతం ఉండగా, 2014 ఎన్నికల్లో 0.81 శాతం పెరిగినట్లు తెలిపింది. అస్సోంలో అత్యధిక నోటా ఓట్లు పోలవగా, 14 సీట్లలో సగటున 1.19 శాతం నమోదయ్యాయి. త్రిపురలో 1.41 శాతం, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయలో 0.98 శాతం నమోదైంది. 2019 ఎన్నికల్లో అసోంలో 0.99 శాతం, త్రిపురలో 1.08 శాతం, మేఘాలయలో 0.33 శాతం నమోదయ్యాయి. ఐదేళ్ల క్రితంతో పోలిస్తే.. అసోం, మణిపూర్, మేఘాలయ, సిక్కిం, త్రిపురలో నోటా ఓట్లు పెరగగా, అరుణాచల్ ప్రదేశ్, మిజోరంలో తగ్గాయి. నాగాలాండ్‌లో స్థిరంగా ఉన్నాయి. అత్యల్పంగా నాగాలాండ్ (1,646), మిజోరాం (1,898), అరుణాచల్ వెస్ట్ (2,296) నోటా ఓట్లు నమోదయ్యాయి.

సామాజిక న్యాయం బుజ్జగింపు కాదు

ముస్లిం రిజర్వేషన్లపై టీడీపీ నేత లోకేశ్

న్యూఢిల్లీ: ఆంధ్ర ప్రదేశ్‌లో ఉద్యోగాల కల్పన, అణగారిన వర్గాల అభ్యున్నతిపైనే తమ పార్టీ దృష్టి సారిస్తుందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తనయుడు నారా లోకేశ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 16 సీట్లు గెలుచుకోవడం ద్వారా ఎన్‌డీఏ ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించింది. రాష్ట్రంలో ముస్లింలకు కల్పించిన రిజర్వేషన్లను తాము కొనసాగిస్తామని, ఈ విధానాన్ని తమ కూటమి భాగస్వామ్య పక్షమైన బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని లోకేశ్ చెప్పారు. 'ఇది (ముస్లింలకు రిజర్వేషన్) గత రెండు దశాబ్దాలుగా కొనసాగుతోంది. మేము దాని కోసం నిలబడతాం. దానిని కొనసాగించాలని మేము భావిస్తున్నాం' అని' అని లోకేశ్ ఒక ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పారు. రాష్ట్రంలో మైనారిటీలు తలసరి ఆదాయం అత్యల్పంగా ఉన్నందున

రిజర్వేషన్ బుజ్జగింపు కోసం కాదని, సామాజిక న్యాయం అని అన్నారు. 'మైనారిటీలు కష్టాలు అనుభవిస్తూనే ఉన్నారనేది వాస్తవం. వారి తలసరి ఆదాయం అత్యల్పంగా ఉంది. ప్రభుత్వంగా వారిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడం నా బాధ్యత. అందువల్ల నేను తీసుకునే ఏ నిర్ణయాలైనా సంతృప్తి కోసం కాదు. వారిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికేనని' తెలుగుదేశం నేత చెప్పారు. 'మీరు మన దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనుకుంటే మనం ఎవరినీ విడిచిపెట్టలేం. మనం కలిసి చేయాలి. దీన్ని చేయడానికి గొప్ప అవకాశం ఉంది. అందరినీ ఒకే తాటిపైకి తీసుకువెళ్లడం టీడీపీకి చెందిన ట్రేడ్‌మార్క్‌గా ఉంది' అని ఆయన అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్ట్ గురించి మాట్లాడుతూ ఇది ప్రతీకార రాజకీయమని, తన తండ్రిని అన్యాయంగా 52 రోజులు జైలులో పెట్టారని అన్నారు. మనం ప్రతీకార రాజకీయాలకు బలిపశువులమని, ప్రతి ఒక్కరికీ సమానంగా చట్టబద్ధత అమలు చేయాలని, భారతదేశంలో ప్రతీకార రాజకీయాలకు తావు లేదని అన్నారు. ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్న ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కొత్త కేబినెట్‌లో స్పీకర్ పదవి సహా కొన్ని కీలక శాఖలను టీడీపీ కోరుతున్నట్లు వచ్చిన వార్తలను ఆయన తోసిపుచ్చారు. 'పదవి కోసం టీడీపీ ఎప్పుడూ చర్చలు జరపదు. రాష్ట్రానికి నిధుల కోసం మాత్రమే చర్చలు జరుపుతాం. మేము మంత్రిత్వ శాఖలను అడగము. మా ప్రయోజనాలే రాష్ట్ర ప్రయోజనాలే' అని లోకేశ్ అన్నారు.

మేధా పాట్కర్‌కు శిక్షపై తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: పరువు నష్టం కేసులో హక్కుల కార్యకర్త మేధా పాట్కర్‌కు విధించే శిక్షపై తీర్పును జులై ఒకటో తేదీకి రిజర్వు చేస్తూ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రాఘవ్ శర్మ ఉత్తర్వులు జారీచేశారు. విక్టిమ్ ఇంప్యాక్ట్ రిపోర్ట్ (వీఐఆర్)ను దిల్లీ న్యాయ సేవల యంత్రాంగం (డీఎల్ఎస్ఏ) కోర్టు ముందరుంచింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం మేధా పాట్కర్‌కు శిక్షపై తీర్పును రిజర్వులో పెట్టింది. ఈ కేసులో గరిష్ఠంగా రెండేళ్ల శిక్షగానీ జరిమానాగానీ లేక రెండింటినీ విధించేందుకు అవకాశముంది. మేధా పాట్కర్‌పై దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా పరువు నష్టం దావా వేశారు. తాను ఎన్జీవో నడిపే సమయంలో మేధా పాట్కర్ తనను అవమానించినట్లు ఆరోపించారు.

9 కిలోల బంగారం పట్టివేత

బెంగళూరు: బెంగళూరులోని విమానాశ్రయాల్లో రెండు వేర్వేరు ఘటనల్లో కస్టమ్స్ అధికారులు 9 కిలోల బంగారాన్ని పట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఉదయం 6.29 కోట్ల విలువైన 9 కిలోల బంగారాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) స్వాధీనం చేసుకున్నట్లుగా గురువారం అధికారులు వెల్లడించారు. బ్యాంకాక్ నుంచి బెంగళూరు వస్తున్న విమానంలో అక్రమంగా బంగారాన్ని తరలిస్తున్నట్లుగా అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు అప్రమత్తమై బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన థాయ్ ఎయిర్‌వేస్ విమానంలో తనిఖీలు నిర్వహించారు.

విమానంలోని ఓ మూలలో దాచిన ఓ హ్యాండ్ బ్యాగులో రూ.4.77 కోట్ల విలువైన 6.834 కిలోల బంగారు బిస్కెట్లను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాగ్ లోపల ఉన్న ఆధారాల ద్వారా దానిని విమానంలో వదిలివేసిన ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకున్నారు. ఈ విచారణలో భాగంగా బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లుగా వారు అంగీకరించారన్నారు. మరో ఘటనలో బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దుబాయ్ నుంచి వచ్చిన ఎమిరేట్స్ విమానంలో రూ.1.52 కోట్ల విలువైన 2.18 కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని విమానం ముందు భాగంలోని లావేటరీలో దాచి తరలిస్తున్నారని అధికారులు తెలిపారు.

'వందేభారత్' వేగం తగ్గుతోంది

రైల్వేశాఖ వెల్లడి

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వందేభారత్ రైళ్ల సరాసరి వేగం గత మూడేళ్లలో గంటకు 84.48 కి.మీ. నుంచి 76.25 కి.మీ.లకు పడిపోయినట్లు రైల్వేశాఖ వెల్లడించింది. ఈ మేరకు సమాచార హక్కు చట్టం (సహచ) ద్వారా మధ్యప్రదేశ్‌కు చెందిన చంద్రశేఖర్ గౌర్ చేసిన దరఖాస్తుకు అధికారులు సమాధానమిచ్చారు. కేవలం వందేభారత్ రైళ్లు మాత్రమే కాదని, వివిధ మార్గాల్లో ట్రాక్ పునరుద్ధరణ, స్టేషన్ల నవీకరణ కారణంగా సాధారణ రైళ్ల వేగం కూడా తగ్గిందని పేర్కొన్నారు. అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లోనూ వందే భారత్ నడుస్తున్నట్లు చెప్పిన రైల్వేశాఖ... అక్కడి వాతావరణ పరిస్థితులు, ట్రాక్ నాణ్యత ఆధారంగా వేగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఏర్పడుతోందని వివరించింది. 'ఉదాహరణకు ముంబై-మడగావ్ మార్గంలో అధిక భాగం కొండ ప్రాంతంలోనే ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ మార్గంలో గరిష్ఠ వేగంతో ప్రయాణించడం అత్యంత ప్రమాదకరం. వర్షాకాలంలో పరిస్థితులు మరింత జటిలంగా మారుతాయి' అని రైల్వేశాఖ అధికారులు వివరించారు. రైల్వేశాఖ ఇచ్చిన వివరాల ప్రకారం.. 2020-21లో వందేభారత్ రైళ్ల సరాసరి వేగం గంటకు 84.48 కి.మీ. కాగా.. 2022-23 నాటికి ఆ వేగం 81.38 కి.మీ.లకు, 2023-24 (ప్రస్తుతం) నాటికి 76.25 కి.మీ.లకు పడిపోయింది. 2019, ఫిబ్రవరి 15న తొలిసారిగా వందేభారత్ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చిన సమయంలో గరిష్ఠంగా గంటకు 160 కి.మీ. వేగంతో ప్రయాణించేలా వీటిని రూపొందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. అయితే, దిల్లీ- ఆగ్రా మార్గంలో తప్ప... ఇతర మార్గాల్లో 130 కి.మీ/గంటకు మించరాదని తెలిపింది. భారత్‌లో తొలి సెమీహైస్పీడ్ రైలు గతిమాన్ ఎక్స్‌ప్రెస్‌ను 160 కి.మీ. వేగంతో నడిపించాలనే ఉద్దేశంతో దిల్లీ- ఆగ్రా మార్గాన్ని 2016లో అత్యాధునిక టెక్నాలజీతో పునరుద్ధరించారు. అందువల్ల ఆ మార్గంలో వందేభారత్ గరిష్ఠ వేగంతో ప్రయాణించే వీలుంది.

చత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోయిస్టుల మృతి

నారాయణ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నారాయణ్‌పూర్- దంతేవాడ జిల్లాల సరిహద్దులోని గోబెల్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు జవాన్లకు గాయాలయ్యాయి. మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ)తో కలిసి సంయుక్త ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. మృతులను నారాయణ్‌పూర్, కొండగావ్, దంతేవాడ, బస్తర్ జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. తాజా ఎన్‌కౌంటర్‌తో కలిసి గత ఏడాది కాలంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇప్పటి వరకు 122 మంది మావోయిస్టులు మృతి చెందారు.

మోదీ వెంటే కలిసి నడుస్తాం: నితీశ్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీకి జేడీయూ అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ సంపూర్ణ మద్దతు పలికారు. ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నితీశ్ మాట్లాడుతూ 'ఏ సందర్భంలోనైనా మేం మీతోనే(మోదీ) ఉంటాం. ఇండియా ఐక్య సంఘటన నేతలు ఈసారి పొరపాటున గెలిచారు. దేశం కోసం వారేమైనా చేశారా? వారంతా వచ్చే ఎన్నికల్లో ఓడిపోతారు. దేశం ఇకపై బృహత్తర ప్రణాళికలు వేసుకుని ముందుకు వెళుతుంది. మీ నేతృత్వంలో మేమంతా కలిసి పని చేస్తాం. బీహార్‌లో పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం. ఎన్డీఏ పక్షాలన్నీ ఏకతాటిపైకి రావడం సంతోషం. ప్రధానిగా మోదీ ఆదివారం ప్రమాణం చేస్తున్నారు. కానీ ఇవాళే ప్రమాణ స్వీకారం చేయాలని కోరుకుంటున్నా. ఎప్పుడు ప్రమాణ స్వీకారం చేసినా మీతోనే నడుస్తాం' అని నితీశ్ పేర్కొన్నారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్లో జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో లోక్‌సభ పక్ష నేతగా నరేంద్ర మోదీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మోదీ పేరును రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించగా అమిత్ షా, చంద్రబాబు, నితిన్ గడ్కరీ, నితీశ్ కుమార్, ఏక్‌నాథ్ షిండే, పవన్ కల్యాణ్ తదితరులు బలపరిచారు.

మెజారిటీ లేకుండా ప్రభుత్వ ఏర్పాటా?

బీజేపీపై సచిన్ పైలట్ మండిపాటు

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిని ప్రజలు తిరస్కరించినట్లు సూచిస్తున్నాయని కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ అన్నారు. అందుకే నరేంద్రమోదీ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నించకూడదని వ్యాఖ్యానించారు. ఈ ఫలితాల విషయంలో బీజేపీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సుమారు 200 సీట్లు వచ్చాయని, అప్పుడు రాజీవ్ గాంధీని ప్రభుత్వం ఏర్పాటు చేయమని కోరగా ప్రజల తీర్పు తనకు అనుకూలంగా రాలేదని తిరస్కరించారని గుర్తుచేశారు. దాంతో అప్పుడు తర్వాత స్థానంలో ఉన్న పెద్ద పార్టీకి పిలుపువచ్చిందని సచిన్ చెప్పారు. ప్రస్తుత ఎన్నికల ఫలితాలు బీజేపీ, ఎన్డీయేకు వ్యతిరేకంగా ఉన్నాయని మీడియాతో మాట్లాడుతూ సచిన్ అన్నారు. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 197 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కావాల్సిన మెజార్టీ మాత్రం రాలేదు. జనతాదళ్ 143 స్థానాలు దక్కించుకుంది. అప్పుడు వీపీసింగ్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ ఎన్నికల విషయానికి వస్తే 293 సీట్లతో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన మెజార్టీ దక్కించుకుంది. ఈ కూటమి ప్రధాన పార్టీ బీజేపీకి 240 సీట్లు వచ్చాయి. గత రెండుసార్లు కమలం పార్టీ సొంతంగా మ్యాజిక్ ఫిగర్(272) దాటగా... ఈసారి ఆ స్థాయి విజయాన్ని అందుకోలేకపోయింది. దీని తర్వాత స్థానంలో కాంగ్రెస్(99) ఉన్న సంగతి తెలిసిందే.

'సిట్' ముందుకు ప్రజ్వల్ తల్లి

కిడ్నాప్ కేసులో ముందస్తు బెయిల్

బెంగళూరు: దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన హసన్ అశ్లీల వీడియో, కిడ్నాప్ కేసుల్లో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. మహిళలపై లైంగిక దౌర్జన్యం, బ్లాక్‌మెయిల్ ఆరోపణలతో హసన్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. కిడ్నాప్ కేసులో ప్రజ్వల్ తల్లి భవానీ రేవణ్ణపైనా ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే కర్నాటక హైకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం ఆమె సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. అంతకుముందు ఈ కేసులో హైకోర్టు ఆమెకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రేవణ్ణ ఇంటి పనిమనిషి అపహరణ వ్యవహారంలో భర్త రేవణ్ణతో పాటు భవానీకి కూడా సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆమెను విచారించేందుకు సిట్ అధికారులు ఇటీవల నోటీసులు పంపారు. హొళెనరసీపురలో నివాసానికి వెళ్లగా ఆమె అందుబాటులో లేకుండా పోయారు. దీంతో పరారీలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే

ముందస్తు బెయిల్ కోసం ఆమె హైకోర్టులో దరఖాస్తు చేసుకోగా... శుక్రవారం మంజూరైంది. అయితే, మధ్యాహ్నం ఒంటిగంటలోపు సిట్ ముందు హాజరుకావడంతోపాటు విచారణకు పూర్తిగా సహకరించాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే ఆమె విచారణకు హాజరయ్యారు. మైసూరు జిల్లాలోని కేఆర్ నగర్ తాలూకా పరిధితోపాటు ఆ మహిళ కిడ్నాప్ జరిగినట్లు భావిస్తున్న హసన్ జిల్లా పరిధిలోకి భవానీని ప్రవేశించకుండా హైకోర్టు నిషేధం విధించింది. ఇదిలాఉండగా, ఈ కేసులో రేవణ్ణను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేయగా ఆ తర్వాత ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. మరోవైపు మహిళ కిడ్నాప్ కేసులో భవానీ కారు డ్రైవర్‌ను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

లాలూకు మరో ఎదురుదెబ్బ

ఉద్యోగానికి భూమి కేసులో సీబీఐ చార్జిషీటు దాఖలు

న్యూఢిల్లీ: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు మరో ఎదురు దెబ్బ తగిలింది. ఉద్యోగానికి భూమి (ల్యాండ్ ఫర్ జాబ్) కేసులో ఆయనపై మరొక చార్జిషీటును సీబీఐ దాఖలు చేసింది. లాలూ సహా 71 మంది పేర్లను అందులో చేర్చింది. ఈ చార్జిషీటుపై విచారణ జరపాలా లేదా అన్నది జులై 6న సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగానే నిర్ణయించనున్నారు. ఈ కేసులో కంక్లూజివ్ చార్జిషీటు దాఖలులో జరిగిన జాప్యానికిగాను సీబీఐని దిల్లీ కోర్టు నిలదీసింది. (కేసు దర్యాప్తు పూర్తి చేసిన సంబంధిత వ్యక్తి నేరం చేసినట్లు నిర్ధారిస్తూ దాఖలు చేసేదాన్ని కంక్లూజివ్ చార్జిషీట్ అంటారు). ప్రతిసారీ గడువు కోరడటం పరిపాటిగా మారడాన్ని దుయ్యబట్టింది. దిల్లీ కోర్టు ఆదేశాలకు అనుగుణంగా తాజా చార్జిషీట్‌ను దాఖలు చేసింది. లాలూ ప్రసాద్ యాదవ్ 2004 నుంచి 2009 వరకు రైల్వేమంత్రిగా ఉన్నప్పుడు జోనల్ రైల్వే ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. అయినప్పటికీ పట్నా, ముంబై, జబల్‌పూర్, కోల్‌కతా, జైపూర్, హాజీపూర్‌లో ఉన్న వివిధ జోనల్ రైల్వేలలో నియమాకాలు చేపట్టారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల నుంచి లాలూ కుటుంబం, సహచరుల పేరుతో భూములను తీసుకున్నట్లుగా ఆరోపణలు వచ్చాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.